Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 247 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 సెప్టెంబర్ 2023 మంగళవారం పేజీలు : 4

## విదేశీ విద్యకు భారత విద్యార్థుల క్యూ

న్యూఢిల్లీ : కొవిడ్ తర్వాత విదేశీ విద్యకు భారతీయ విద్యార్థులు క్యూ కడుతున్నారు. 2021 తర్వాత భారతదేశం నుంచి విదేశాలకు గ్రాడ్యుయేషన్ లేదా సర్టిఫికేషన్ కోసం వెళ్లేందుకు టోఫెల్ పరీక్ష రాసే వారి శాతం 7.77కు పెరిగినట్లు ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) తెలిపింది. అంతకుముందు ఇది 5.83 శాతంగా ఉన్నట్లు తెలిపింది. అయితే ఇదే సమయంలో విదేశాల్లో ఉద్యోగం చేసేందుకు లేదా వలస వెళ్లేందుకు టోఫెల్ పరీక్ష రాసే వారి శాతం మాత్రం 8.19 నుంచి 7.77కు తగ్గినట్లు ఈటీఎస్ తెలిపింది.



## కాంగ్రెస్ జాబితా ఖరారు వేళ

# అసలు వర్సస్ వలస

## ఆ నివేదికలే కీలకం..!!

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదలకు రంగం సిద్ధం అవుతోంది. కసరత్తు దాదాపు తుది దశకు చేరంది. ఇప్పటికే 70 మంది అభ్యర్థుల విషయంలో ఏకాభిప్రాయం వచ్చినట్లు సమాచారం. మరో 30 స్థానాల విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమయంలో అభ్యర్థుల ఎంపికలో పార్టీ రాజకీయ వ్యూహకర్త సునీల్ కనుగోలు ఇచ్చిన సర్వే నివేదికలే కీలకంగా మారుతున్నట్లు తెలుస్తోంది.

**అభ్యర్థుల ఎంపిక :** కాంగ్రెస్ పార్టీలో అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక ఓ కొలిక్కి వస్తోంది. 70 నియోజకవర్గాలకు సంబంధించి వడపోతను పూర్తి చేసినట్టు తెలుస్తోంది. నలభైకి పైగా సీట్లకు ఒక్కో అభ్యర్థి పేరును, మరో 30 సీట్లకు ఇద్దరి పేర్ల చొప్పున ఫైనల్ చేసినట్టు సమాచారం. ఇద్దరేసి పేర్లను ఎంపిక చేసిన నియోజకవర్గాలకు సంబంధించిన సర్వేల ఆధారంగా అభ్యర్థిని ఖరారు చేసే అధికారాన్ని పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి అప్పగించినట్టు సమాచారం. అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన ఢిల్లీలో వరుసగా రెండోరోజూ నేతల భేటీ జరిగింది. ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు క్షేత్ర స్థాయి సమాచారం..పోటీలో ఉన్న వారిపైన సర్వేల్లో తేలిన అంశాలను కమిటీ ముందు ఉంచినట్లు తెలుస్తోంది.

**గెలుపే ప్రామాణికంగా :** ఎంపిక సమయంలో పలు అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. రాజకీయ, కుల సమీకరణాలు, ప్రజాక్షేత్రంలో బలాబలాలు, సర్వే నివేదికల ఆధారంగా ఈ 30 స్థానాల్లో ఇద్దరేసి నేతలను ఎంపిక చేసినట్టు తెలిసింది.

ఈ లిస్టులో ఎల్‌బీనగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మేడ్చల్, శేరిలింగంపల్లి, బోథ్, ఖానాపూర్, కరీంనగర్, డోర్నకల్, మహబూబాబాద్, పరకాల జనగాం, వర్ధన్నపేట, వనపర్తి, నారాయణపేట, నకిరేకల్, తుంగతుర్తి, నర్సాపూర్, దుబ్బాక, నారాయణఖేడ్, జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, మునుగోడు, సికింద్రాబాద్, హుస్నాబాద్ తదితర నియోజకవర్గాలు ఉన్నట్టు సమాచారం. వీటికి ఎంపిక చేసిన ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరిని ఫైనల్ చేసే అధికారాన్ని కేంద్ర ఎన్నికల కమిటీకి అప్పగించాలని భేటీలో నిర్ణయించారు. అక్కడే చిక్కుముడి : 40 స్థానాలు మినహా.. మిగతా సీట్లకు అభ్యర్థుల ఎంపికపై నేతల మధ్య తీవ్రస్థాయిలో భేదాభిప్రాయాలు వ్యక్తమైనట్టు సమాచారం. కొన్ని స్థానాలపై చర్చ సమయంలో తీవ్ర స్థాయిలో వాదనలు చేసుకున్నట్టు తెలిసింది. అసలు కాంగ్రెస్ - వలస నేతలు అన్న ప్రాతిపదికన ఈ వాగ్వాదం జరిగిందని.. ఎన్నారైలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల పేర్లను సీఈసీకి పంపే విషయంలో నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. మెజార్టీ సభ్యులు ఒక్క పేరే సూచించిన పలు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థి ఎంపిక ఫైనల్ కాలేదని.. అలాంటి స్థానాలను ప్రస్తుతానికి పక్కనపెట్టాలని కొందరు నేతలు పట్టు బట్టినట్టు చెబుతున్నారు. దీంతో, మిగిలిన స్థానాల పైన కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం అనివార్యమవుతుందనే ప్రచారం సాగుతోంది.

## మోదీ తొమ్మిదిన్నరేళ్లలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు



హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తొమ్మిదిన్నరేళ్లలో దేశంలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవ పక్షం కార్యక్రమంలో భాగంగా మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో అమీర్‌పేట్‌లోని MCH గురుగోవింద్ స్టేడియంలో సోమవారం నాడు రక్తదాన శిబిరాన్ని ప్రారభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. "నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు బీజేపీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో స్వచ్ఛ భారత్, రక్తదాన శిబిరాలు, హెల్త్ క్యాంపులు చేపడుతున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం. మోదీ తొమ్మిదిన్నరేళ్లలో.. కరోనాను సమర్థవంతంగా ఎదుర్కోవడం, ఉచితంగా వ్యాక్సిన్, ఆర్టికల్ 370 రద్దు, నూతన విద్యా విధానం, జీఎస్టీ, ఉచిత బియ్యం పంపిణీ, జీఎస్టీ, ఉగ్రవాద నిర్మూళన, ప్రపంచ దేశాల్లో భారత ప్రతిష్టను పెంచడం, జీ20 లాంటివి సహా.. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా నీతి నిజాయతీతో పాలన అందిస్తున్నారు. ఆయనకు మరింత అండదండగా ఉండాలని, ఆయన దేశానికి మరింత సేవ చేసే శక్తి ఇవ్వాలని మేము కోరుకుంటున్నాం. అక్టోబర్ 2వ తేదీన దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనాలి. ఈ మేరకు అక్టోబర్ 1వ తేదీన అన్ని ప్రాంతాల్లో కార్యక్రమానికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. అక్టోబర్ 1వ తేదీనే పీఎం మోదీ హైదరాబాద్‌కు వస్తారు. ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, పాలమూరు వెళ్లి బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్టోబర్ 3వ తేదీన నిజామాబాద్ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## తమిళిసై గవర్నర్‌లా కాకుండా బీజేపీ ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారు

### మండిపడ్డ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ : గవర్నర్ తమిళిసై తీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమిళిసై గవర్నర్‌లా కాకుండా బీజేపీ ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కేబినెట్ ఆమోదించిన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను గవర్నర్ ఎలా తిరస్కరిస్తారు అని ప్రశ్నించారు. తమిళిసై ఆది నుంచి తెలంగాణ ప్రగతికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. ఇప్పటికే పలు కీలక బిల్లులు గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. గవర్నర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. సుబ్రహ్మణ్య స్వామిని రాజ్యసభకు ఎలా నామినేట్ చేశారో గవర్నర్ చెప్పాలని మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కుర్రా సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా పంపాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జులై 31వ తేదీన ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్సీలు ఫారూక్ హుస్సేన్, రాజేశ్వరరావు పదవీకాలం ముగియడంతో వారి స్థానాల్లో దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. సంగారెడ్డికి చెందిన కుర్రా సత్యనారాయణ జనతాపార్టీ, బీజేపీలో పనిచేశారు. 1999లో టీడీపీ-బీజేపీ పొత్తులో భాగంగా సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సత్యనారాయణ 2018 వరకు బీజేపీలోనే ఉన్నారు. ఆ పార్టీ తెలంగాణ వ్యతిరేక వైఖరికి నిరసనగా రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ దాసోజు శ్రవణ్ బీసీ వర్గాల బలమైన గొంతుకగా ఎదిగారు.

ప్రజారాజ్యంలో కొంతకాలంపాటు పనిచేసిన ఆయన ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి పలు హొదాల్లో పనిచేశారు. తెలంగాణ కోసం కేంద్రం నియమించిన శ్రీకృష్ణ కమిటీకి బీఆర్ఎస్ సమర్పించిన చారిత్రక నివేదిక రూపకల్పన బృందంలో సభ్యుడిగా పనిచేశారు.




## కేటీఆర్‌కు బేతి సుభాష్‌రెడ్డి

# ఝలక్

### ఏ పార్టీలో చేరబోతున్నారంటే..?!

హైదరాబాద్: మంత్రి కేటీఆర్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఝలక్ ఇచ్చారు. ఉప్పల్ భగాయత్‌లో మంత్రి కేటీఆర్ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరు కాలేదు. దీంతో ఈ విషయం చర్చానీయాంశం అవుతోంది. కొంతకాలంగా బీఆర్ఎస్ అధిష్ఠానంపై ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. మంత్రి కేటీఆర్ ఉప్పల్ భగాయత్ వద్ద మూసీపై బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం నాడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందించిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి దూరంగా ఉన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి భండారి లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పబ్లిక్ మీటింగ్‌కు మంత్రి కేటీఆర్ హాజరుకాకుండానే వెళ్లిపోయారు. టికెట్ ఇవ్వకపోవడంతోనే అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ మారే ఆలోచనలో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. కాగా.. కొన్ని రోజుల క్రితం సీఎం కేసీఆర్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ లిస్టులో తన పేరు ఉంటుందని భావించినా సుభాష్‌రెడ్డికి కేసీఆర్ మొండిచేయి చూపించారు. దీంతో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే బండారు లక్ష్మారెడ్డికి తనకు కూడా కొంతకాలంగా రాజకీయ పోరు నడుస్తోంది. దీనికి తోడూ కేసీఆర్ కూడా బండారు లక్ష్మారెడ్డికే టికెట్ కేటాయించడంతో సుభాష్‌రెడ్డి తీవ్ర నిరాశలో ఉన్నారు. నియోజకవర్గంలో బలహీనంగా ఉన్న పార్టీని అన్నీ వర్గాలకు చేరువయ్యేలా చేశానని పలువురి దగ్గర ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి వాపోతున్నారు. నియోజకవర్గంలో ఇంత చేసిన పార్టీకి తనను దూరంగా పెడుతున్నారని అనుచరుల దగ్గర తన ఆవేదనను వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు చేరవయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ మధ్య ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కొంతమంది కాంగ్రెస్ నేతలు కూడా కలిసినట్లు విశ్వసనీయ సమాచారం. దీనికితోడూ ఉప్పల్ నియోజకవర్గంపై మొదటి నుంచి కాంగ్రెస్‌కు మంచి పట్టుంది. తన అనుచరులు కూడా పార్టీ మారితేనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యేకు సూచించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో మంచి దమ్మున్న లీడర్ పార్టీకి దూరమైతే ఈ నియోజకవర్గంలో పార్టీ బలహీన పడే అవకాశాలు ఉన్నాయని.. జంట నగరాలపై కూడా ఈ ప్రభావం పడే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




ఆదిలాబాద్: బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాథోడ్ బాపు రావు పార్టీ వీడే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాపు రావుకు బదులు అనిల్ జాదవ్‌ను అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించింది. అప్పటి నుంచి అసంతృప్తితో ఎమ్మెల్యే బాపురావు రగిలి పోతున్నారు. మంత్రి కేటీఆర్ అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం లేదని మనస్తాపం చెందారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ వీడే యోచనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో చేరేందుకు బాపు రావు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్ అధిష్టానం తొలి జాబితా విడుదల చేసింది. ఇందులో కొంత మంది సిట్టింగ్‌లకు సీఎం కేసీఆర్ అవకాశం ఇవ్వలేదు. దీంతో వారంతా అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు కూడా సీటు రాకపోవడంతో ఆమె కూడా అసంతృప్తితో ఉన్నారు. రేఖానాయక్ కూడా బీఆర్ఎస్ వీడే యోచనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే జనగామ, ఉప్పల్, స్టేషన్ ఘన్‌పూర్‌లో కూడా సీట్ల పంచాయితీ నడుస్తోంది. ముందు ముందు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

# సంపాదకీయం

## కెనడా...భారత్ ల మధ్య అలా మొదలైంది వివాదం

కెనడా నాలుగు కోట్ల మంది జనాభా ఉన్న దేశం. భారత్ 143 కోట్ల మంది జనాభాతో ప్రపంచంలో ఈ రోజు అతి పెద్ద దేశం. కెనడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తొమ్మిదవ స్థానంలో ఉంది. భారత్ అయిదవ స్థానంలో ఉంది. మూడవ స్థానానికి ఏగబాకనుంది. రెండూ కూడా అభివృద్ధిలో ధీటైన దేశాలే. భారత్ కెనడాల మధ్య ఎగుమతులు దిగుమతులు జరుగుతూ వస్తూ ఉంటాయి. రెండు దేశాల మధ్య మంచి సంబంధాలే ఉన్నాయి. అయితే గత కొంతకాలంగా అవి నెమ్మదిగా క్షీణిస్తూ వస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది మధ్యలో ఖలిస్థాన్ ప్రబోధకుడు అమృత్ పాల్ సింగ్ మీద భారత్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దానికి వ్యతిరేకంగా కెనడాలో భారత దౌత్య కార్యాలయాన్ని టార్గెట్ గా చేసుకుని అక్కడ ఖలిస్థాన్ మద్దతుదారులు ఆందోళనకు దిగారు. అపుడు మొదటిసారిగా భారత్ రియాక్ట్ అయింది. కెనడాలో భారత దౌత్య కార్యాలయం భద్రత చూడాలని కెనడాను కోరింది. దీని తరువాత కెనడాలో బ్రాంప్టన్ లో ఇందిరాగాంధీ హత్యను చిత్రీకరిస్తూ ఖలిస్థాన్ మద్దతుదారులు ఆందోళనలు నిర్వహించారు. దీని మీద అయితే కెనడా ప్రభుత్వం మీదనే భారత్ విదేశాంగ మంత్రి జై శంకర్ గట్టిగానే మండిపడ్డారు. ఇలాంటి చర్యలు ఇండియా కెనడాల మధ్య సంబంధాలను దెబ్బతీస్తాయని కూడా హెచ్చరించారు. ఇంతలో ఖలీస్థాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు గురి అయ్యాడు. ఆయన బ్రిటిష్ కొలంబియాలోని గురుద్వారాలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. దీంతో ఈ కేసు మీద కెనడా ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేసించింది. నిజ్జర్ హత్యకు కెనడాలోని భారత్ హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ, కౌన్సిల్ జనరల్ అపూర్వ శ్రీ వాస్తవలే కారణం అని ఖలిస్థాన్ మద్దతుదారులు ఆరోపించారు. ఇలా భారత్ మీద భారత దౌత్య అధికారుల మీద నేరుగా వారు ఆరోపణలు చేయడం వివాదం అయింది. అంతే కాదు టొరొంటోలో జూలై 8న దీని మీద భారీ ర్యాలీ నిర్వహించి మరీ కరపత్రాలను పంపిణీ చేశారు. దీన్ని భారత్ మరింత సీరియస్ గా తీసుకుంది. ఇంతలో జీ 20 సమ్మిట్ న్యూ ఢిల్లీలో జరిగింది. దానికి కెనడా ప్రధాని ట్రుడ్రో హాజరయ్యారు. కానీ ఆయన భారత్ మీద మనసులో పెట్టుకునే ఈ మీటింగ్ కి వచ్చారు అని అంటున్నారు. ఆయనకు హై లెవెల్ సెక్యూరిటీతో ఢిల్లీలో సూట్ ని కేటాయిస్తే సాధారణ గదిలోకి మారి మూడు రోజులూ అక్కడే గడిపారు అని తెలిసింది. ఇక ఆయన వచ్చిన విమానానికి సాంకేతిక లోపం తలెత్తితే భారత్ మర్యాదగా తాము విమాన సౌకర్యం కల్పిస్తామని చెప్పినా నో చెప్పి మరీ మూడు రోజులు ఢిల్లీలోనే ఉన్నారు. చివరికి తన విమానంలోనే ఆయన కెనడా పయనం అయ్యారు. దీని కంటే ముందు జీ 20లో కెనడా ఉగ్రవాదులకు ఆవాసంగా మారుతోంది అని ప్రధాని నరేంద్ర మోడీ సదస్సు దృష్టికి తెచ్చారు. అంతే కాదు ఖలిస్థాన్ ఉగ్రవాదాన్ని అణచడంతో పాటు మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణ వంటి వాటిని అరికట్టడంతో పరస్పరం సహకరించుకోవాలని కెనడాకు భారత్ సూచించింది. అయితే కెనడా ప్రధాని మాత్రం తమ దేశంలో భావ ప్రకటనకు గౌరవం ఎక్కువ అన్నట్లుగా మాట్లాడారు. శాంతియుతంగా జరిగే అందోళనలకు అవకాశమిస్తామని కూడా చెప్పడం విశేషం. అల్లర్లను సహించబోమంటూనే ఎవరో కొందరు చేసే అల్లర్లను గొడవలను మొత్తం వర్గానికి ఆపాదించడం తగదని తెగేసి చెప్పిన తీరుతో కెనడా కడుపులో అక్కసు ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది అంటున్నారు. ఇక జీ 20 సదస్సు నుంచి తన దేశానికి వెళ్ళిన కెనడా ప్రధాని అక్కడ పార్లమెంట్ లో మాట్లాడుతూ నిజ్జర్ హత్యకు భారత్ హస్తం ఉందని వివాదాస్పద కామెంట్స్ చేసి అగ్గి రాజేశారు. తమ పౌరుల పట్ల విదేశీ పెత్తనాన్ని సహించేది లేదని కూడా ఘాటైన కామెంట్స్ చేశారు. ఇలా కనుక చూసుకుంటే అమృత్ పాల్ తో మొదలైన వివాదాం కాస్తా జీ 20 సదస్సులో బాహాటం అయింది. మరో వైపు చూస్తే పూర్తిగా రాజకీయ కారణాలతో ట్రుడ్రో భారత్ మీద వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు అని అంటున్నారు.

ట్రుడ్రో మీద ప్రజలలో వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని, ఆయన ఈసారి ఖలిస్తాన్ మద్దతు గ్రూపుల వర్గాల మ ద్దతుతో మళ్ళీ గెలవాలనే వారికి అండగా ఉంటూ మాట్లాడుతున్నారు అని అంటున్నారు. ఏది ఏమైనా భారత్ కి ఇపుడు కెనడాతో కొత్త వైరం పుట్టుకొచ్చింది అనుకోవాలేమో.

# సమస్యలకు త్వరితగతిన పరిష్కారం




కరీంనగర్ : ప్రజా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేందుకు వీలుగా..పాలన పరంగా ఇబ్బందులు రాకుండా ఉండేందుకు పురపాలికల్లో వార్డుకోక ప్రత్యేకాధికారిని నియమించేందుకు పురపాలక శాఖ చర్యలు ప్రారంభించింది..ఇదే విషయాన్ని కరీంనగర్‌లో జరిగిన జిల్లా, పురపాలిక అధికారుల సమీక్ష సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు..అంతేకాకుండా నగరంలోని స్మార్ట్ డివిజన్లను కలుపుతూ రెండు డివిజన్లకు ఒక ప్రత్యేకాధికారిని నియమిస్తామని తెలుపడంతో పాలనపరంగా సౌలభ్యం కానుంది. జిల్లాలోని కరీంనగర్ నగరపాలికతో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల్లో పట్టణ ప్రగతి మరింత ముందుకు తీసుకెళ్లడానికి గడువు విధించారు. ఏడాదిలోగా మార్పులు కనిపించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసేలా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు దిశా నిర్దేశం చేశారు. ప్రజలు కోరుకున్నట్లుగా అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్లడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు చేసేలా ఆదేశాలు ఇవ్వడంతో పాలకవర్గ సభ్యులకు, అధికారులకు సవాల్‌గా నిలువనుంది. దీంతో పాటు పాలనా పరంగా ఇబ్బందులు రాకుండా పనుల్లో జాప్యం రాకుండా ఉండేందుకు వార్డుకోక అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. ప్రతీ అంశాన్ని ఈ అధికారికే బాధ్యతలు అప్పగిస్తారు.వేగంగా..వార్డులు, డివిజన్‌లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడూ తెలుసుకునేందుకు రెండు డివిజన్లకు ఒక వార్డు అధికారిని నియమిం చనున్నారు. మొదటగా 31స్మార్ట్ డివిజన్లకు ఒక అధికారిని నియమిస్తామని చెప్పినప్పటికీ 60డివిజన్లు ఉండటంతో రెండింటికి ఒకర్ని నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణ ప్రణాళిక ఇబ్బందులు, రహదారి విస్తరణలు, పారిశుద్ధ్యం, హరితహారం, పౌరసేవలు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేలా పర్యవేక్షణ మరింత పెంచనున్నారు. నగర, మున్సిపాలిటీలకు వెళ్లితే అధికారులు దొరకడం లేదనే ఫిర్యాదులు రాకుండా డివిజన్లు, వార్డుల్లోని అధికారుల దగ్గరికి వెళ్లి పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించనున్నారు.

ఎనిమిది చోట్ల..నగరంలోని విలీనమైన కాలనీల్లో ప్రత్యేకంగా భవనాలు ఉన్నాయి. గతంలో పంచాయతీలుగా కొనసాగగా ప్రస్తుతం డివిజన్ కార్యాలయాలుగా మార్చుకున్నారు. వాటిలో బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య, నీటి, లైటింగ్ కార్మికులు, సిబ్బంది వీటిని ఉపయోగించుకుంటున్నారు. అప్పుడప్పుడూ వెళ్లే అధికారులు తప్ప ఇతర సమయాల్లో ఏ అధికారి కనిపించరు. ఎనిమిది చోట్ల ఉపయోగకరంగా ఈ భవనాలు ఉండగా మిగతా ప్రాంతాల్లో ఇలాంటి భవనాలు నిర్మిస్తే కార్మికులకు, డివిజన్‌కు కేటాయించే అధికారికి సౌకర్యంగా ఉండే అవకాశముంటుంది.

రెండు నెలల్లో నియామకం

డివిజన్, వార్డుకో అధికారులను రెండు నెలల్లో నియమిస్తామని పురపాలిక మంత్రి కేటీఆర్ ప్రకటించారు. జిల్లాలోని ఐదు పురపాలికల్లో ప్రత్యేకంగా 73మందిని భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్ నగరపాలకలోనే వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్త మున్సిపాలిటీల్లో పోస్టుల భర్తీ అంతంతా మాత్రంగానే ఉంది. పట్టణ ప్రగతి, హరితహారం, ఇతర ప్రభుత్వ పథకాల అమలు చేయాలంటే ఒక్కొక్క ఏఈకి పది డివిజన్లు అప్పగిస్తున్నారు. ఈ విధానం అటకెక్కనున్నట్లు సమాచారం. ఒకటి, రెండు వార్డులు, డివిజన్లకు ప్రత్యేకంగా అధికారిని నియమిస్తే అన్నీ తానే పర్యవేక్షణ చేసుకునే వీలుంటుంది. ప్రస్తుతం ఏ విభాగానికి వారే చూసుకోవాల్సి రావడంతో పనిభారం పెరుగుతుంది. పైగా ఆలస్యం చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా అధికంగా వస్తున్నాయి.

# సంస్కృతి వారధి.. యువత ప్రతినిధి



కరీంనగర్ : కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్ చేతుల మీదుగా ధ్రువపత్రం పొందుతున్న సంస్కృతి 'యువత ఆలోచన ధోరణిలో మార్పు వస్తే.. దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది.. ఏదైనా సాధించాలన్న తపన.. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలన్న ఆలోచన ఉంటే.. నూతన ఆవిష్కరణలు సాకారమవుతాయి. యువత భవిష్యత్తు ప్రణాళికను సేకరించేందుకు ప్రత్యేకంగా పార్లమెంట్లో స్థానం కల్పించడం ఎంతో గొప్ప విషయం. 29 రాష్ట్రాల నుంచి వచ్చి 87 మంది యువతలో తెలంగాణ తరఫున నేను పాల్గొనే అవకాశం రావడం మధురానుభూతిగా' చెప్పారు.. మూడో యూత్ పార్లమెంట్లో పాల్గొన్న గోదావరిఖని ట్రిమ్స్‌జీ విశ్వవిద్యాలయం ఎంబీఏ విద్యార్థి సంస్కృతి.. ఆమెకు ఈ అవకాశం ఎలా దక్కింది.. పార్లమెంటు విశేషాలతో కథనం..నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే), జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ 2022లో పాల్గొనే సువర్ణవకాశాన్ని ఖనికి చెందిన విద్యార్థి సంస్కృతి తన ప్రతిభతో దక్కించుకున్నారు. 'ట్రిమ్స్‌జీ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్, అధ్యాపకుల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకెళ్లా.. అమ్మ మంజుల. నాన్న రవీందర్ సిద్దిపేటలో డీఆర్‌డీఏ ఏపీడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. కళాశాల స్థాయిలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ ఎంపిక పోటీల్లో ఐదు అంశాల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాకు ఇద్దరి చొప్పున ఎంపిక చేశారు. 'బేటీ బచావో– బేటీ పడావో' అంశాన్ని వివరించి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్కు ఎంపికయ్యా.. రాష్ట్ర యూత్ పార్లమెంటులో జిల్లాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏడు అంశాల్లో 'ఏక్‌భారత్–శ్రేష్ఠభారత్' అంశాన్ని ఎంచుకొని ప్రతిభ కనబరిచాను. నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌కు తెలంగాణ నుంచి యువత తరపున మాట్లాడేందుకు ఎంపికయ్యాను. కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి, యూనియన్ మంత్రులు, జ్యూరీ మెంబర్స్‌తో కలిసి చర్చించే అరుదైన అవకాశం లభించిందని' ఆమె చెప్పారు.

ఊహించిన అవకాశం..

విశ్వవిద్యాలయం స్థాయిలో నిర్వహించిన జాతీయ సేవా పథకంలో చురుగ్గా పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తూ ఉండగా పార్లమెంట్లో పాల్గొనే అవకాశం ఊహించకుండా వచ్చింది. ఇది జీవితంలో మరిచిపోలేనిది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ ఇతర రాష్ట్రాల వారితో సంభాషణ వారి ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, సిక్కిం వస్త్రధారణ(బక్కు), కర్ణాటక, చిక్‌మంగుళూరు ఆహారపు అలవాట్లు తెలుసుకోవడంతో పాటు తెలంగాణ ఖ్యాతిని వివరించాను. పార్లమెంట్ సభలో చర్చ అనంతరం కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్‌లో కలిసి అల్పాహారం చేయడం.. లోక్‌సభ స్పీకర్ హెూంబిర్లాతో కలిసి రాత్రి భోజనం చేయడంతో పాటు మా కోసం సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలు ప్రదేశాలు మ్యూజియం, గ్రంథాలయం, లోక్‌సభ, రాజ్యసభ, ఒకే వరుస క్రమంలో ఉన్న రాష్ట్రపతి భవనం, ఇండియా గేట్, జాతీయ క్రీడా మైదానం, 26 వేల మంది అమరవీరుల పేర్లు బంగారు అక్షరాలతో చెక్కిన(వార్ మెమోరియల్)ను ప్రత్యేక వాహనంలో సందర్శించే అవకాశం కల్పించారు.

# అగ్గి రాజుకుంటే బుగ్గి..!

వరంగల్ : వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాలు ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లోని నిరుపేద గిరిజన కుటుంబాలను నిరాశ్రయులను చేస్తున్నాయి. ఏటా పదుల సంఖ్యలో ఇళ్లు అగ్నిప్రమాదానికి గురవుతున్నాయి. అడవులు ఆకురాల్చే సమయంలో మంటలు వ్యాపించి సమీపంలోని పంటభూముల్లోని కంది, మొక్కజొన్న, మినుము, పెసరపంటలు కాలిపోతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని 16 మండలాల్లో వేసవి వస్తే చాలు ఏదో చోట అగ్నిప్రమాదాలు సంభవించి ఆస్తినష్టం కలుగుతోంది. ఆపద సమయంలో మహబూబాబాద్, మరిపెడలోని అగ్నిమాపకకేంద్రాల్లో ఉన్న రెండు అగ్నిమాపక శకటాలే ఆధారమవుతున్నాయి. ప్రమాద సమయంలో అగ్నిమాపక శకటాలు బయ్యారం, గార్ల, గూడూరు, కొత్తగూడ, గంగారం, కేసముద్రం మండలాలకు చేరుకోవాలంటే 40 నుంచి 50కిమీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అగ్నిమాపక శకటం ఘటనాస్థలికి చేరుకునే లోపే సర్వం బుగ్గి పాలౌతుంది. మండలకేంద్రాలకు సమీపంలో అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటుచేయాలనే ప్రజల ఆకాంక్ష దశాబ్దాలకాలంగా నెరవేరడంలేదు.

ఎటు చూసినా 50కిమీ పైనే

బయ్యారం, గూడూరు, కేసముద్రం, డోర్నకల్ మండలాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు కలగానే మిగులుతోంది. జిల్లాలోని మహబూబాబాద్‌లోని అగ్నిమాపక కేంద్రానికి కొత్తగూడ, గంగారం, బయ్యారం మండలాల శివారు ప్రాంతాలు 50కిమీ దూరానికి పైనే ఉంటుంది. బయ్యారం మండలం మిర్యాలపెంట, కంబాలపల్లి, పందిపంపుల గ్రామాల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే మహబూబాబాద్‌లోని అగ్నిమాపక శకటం అక్కడకు వెళ్లాలంటే రెండు గంటల సమయం పడుతోంది. అక్కడ శకటం అందుబాటులో లేని పక్షంలో ఇల్లెందు నుంచి వాహనం రావాల్సి వస్తుంది. అదే పరిస్థితి డోర్నకల్ నియోజకవర్గంలోని గ్రామాలకు ఏర్పడుతుంది.

బయ్యారం మండలం కస్తూరినగర్ శివారులో జనవరి 24న సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు 15 ఎకరాల్లోని కంది, మొక్కజొన్న పంట కాలిపోయింది.కురవి మండలం భూక్యాతండాలో ఫిబ్రవరి 2న జరిగిన అగ్నిప్రమాదంలో మూడిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సకాలంలో అగ్నిమాపక శకటం రాకపోవడంతో రూ.5లక్షల ఆస్తినష్టం సంభవించింది.మరిపెడలోని బంగారం తయారీ దుకాణంలో మార్చి 12న జరిగిన అగ్నిప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం సంభవించింది.గార్ల మండలం చిన్నకిష్టాపురంలో ఈ నెల 14న ఐదు ఎకరాల పశుగ్రాసం దగ్ధమై రూ.లక్ష నష్టం వాటిల్లింది.ఈనెల 17న కొత్తగూడ సమీప అటవీప్రాంతంలో అగ్నిజ్వాలలు ఎగిసిపడి అడవి అగ్నికి ఆహుతైంది.డోర్నకల్‌లో ఏర్పాటుకు ప్రతిపాదన

– భగవాన్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి, మహబూబాబాద్

ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం డోర్నకల్ నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం ఇప్పటికే స్థలాన్ని కూడా పరిశీలించారు. జిల్లాలోని 16 మండలాల్లో అగ్ని ప్రమాదాల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. సాధ్యమైనంత వరకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వేగంగా స్పందించి వాహనాలను ఘటనాస్థలికి చేర్చుతున్నాం.

# వంద పడకల ఆసుపత్రికి 5.12 ఎకరాలు

వరంగల్ : పరకాలలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్దనే ఆసుపత్రి భవనాన్ని నిర్మించనున్నారు. 5.12 ఎకరాల స్థలం అప్పగింతతో కూడిన నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ఆమోదం లభించిన వెంటనే టెండర్ పనులు మొదలయ్యే అవకాశాలున్నాయి.

ఆమోదం పొందగానే పనులు

ప్రస్తుత ఆసుపత్రి స్థలం సరిపోయే పరిస్థితులు లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం వద్ద 948, 950 సర్వే నెంబర్లలోని 5.12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని పాలకులు, అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు శంకుస్థాపనకు ముందే సర్వే చేపట్టి పూర్తి చేశారు. ఎంపీడీవో కార్యాలయం ముందు నుంచి ఎస్సీ బాలికల వసతి గృహం వరకు 3.17 ఎకరాలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రహరీ గోడను ఆనుకుని పాత శిథిల భవనాల వరకు 1.35 ఎకరాల స్థలాన్ని తీసుకోవాలని నిర్ణయించారు. 60 మీటర్ల వెడల్పు, 90 మీటర్ల



పొడవుతో మూడు ఎకరాలకుపైగా స్థలంలో ఆసుపత్రి భవనాలు, ప్రస్తుతం పుర పరిధిలో పార్కు నిర్మాణం చేపట్టిన 1.35 ఎకరాల్లో డాక్టర్లు, సిబ్బంది ఉండేలా నివాస గృహాలు నిర్మించనున్నారు. ప్రస్తుత ఎంపీడీవో కార్యాలయం సగానికిపైగా తొలగించాల్సి వస్తుండగా ఆ కార్యాలయాన్ని మరో చోటుకి తరలించాలని యోచిస్తున్నారు. ఈ స్థలం అప్పగింతపై మండల పరిషత్ కార్యాలయం నుంచి తీర్మానం చేసి సర్వే నివేదికతో జోడించి ఇటీవల ప్రభుత్వానికి పంపారు. ఆమోదం లభించగానే రూ.35 కోట్లతో చేపట్టనున్న పనులకు టెండర్లు జరగనున్నాయి. ఏడాదిలోపే ఆసుపత్రిని నిర్మించి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చూస్తామని మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. నిర్మాణం పూర్తయితే పరకాల ప్రాంత ప్రజలకు 24 గంటలు అన్ని రకాలు వైద్య సేవలు అందనున్నాయి.

నివేదిక పంపాం – జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్

వంద పడకల ఆసుపత్రికి ఎంపీడీవో కార్యాలయం పరిసరాల్లో 5.12 ఎకరాల స్థలాన్ని గుర్తించాం. ఆ స్థలంలో ఆసుపత్రి భవనాలు, నివేశన స్థలాలు నిర్మించుకోవచ్చు. స్థలం అప్పగింతకు సంబంధించిన సర్వేచేసి ప్రతిపాదనలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపాం. ఆమోదం రావాల్సి ఉంది.

# వరి తగ్గింది.. శనగ పెరిగింది

నంగారెడ్డి : యాసంగిలో వరి సాగు వద్దని చెప్పడంతోపాటుగా ...ఎవరైనా ధాన్యం పండించినా కొనుగోలు చేయబోమని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అన్నదాతలకు ఈ విషయమై అవగాహన కల్పించి.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. రైతు వేదికలను వినియోగించుకొని సదస్సుల ద్వారా చైతన్యం తీసుకొచ్చారు. ఆ ప్రచారం ఫలితానిచ్చినట్లు యాసంగిలో సాగైన పంటల లెక్కలు వెల్లడిస్తున్నాయి. గతేడాది..ఈ ఏడాది యాసంగిలో సాగు చేసిన పంటల తీరు తెన్నులపై' ప్రత్యేక కథనం.

అధికారుల అంచనాలను మించి...

జిల్లాలో ప్రస్తుత యాసంగిలో అన్ని పంటలు కలిపి 82,083 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించింది. ఇందుకు భిన్నంగా 1,33,881 ఎకరాల్లో సాగు చేశారు. గత యాసంగిలో ఈ సంఖ్య 1,39,587గా ఉంది. అంటే ఈసారి మొత్తంగా 5,706 ఎకరాల సాగు తగ్గిపోయింది. ప్రధాన పంటల వారీగా పరిశీలిస్తే వరి 40,340 ఎకరాల్లో, మొక్కజొన్న 3,286, జొన్న 11,339, శనగ 22,637, వేరుశనగ 284, తెల్లకుసుమ 2,923 ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు.



వాస్తవంగా వరి మినహా మిగిలిన పంటలన్నీ అంచనాలకు మించి సాగయ్యాయి. చెరకు విషయంలో అధికారులు ఎలాంటి అంచనా వేయకున్నా.. ఈసారి 10,791 ఎకరాల్లో సాగు చేశారు. పొద్దు తిరుగుడు 106 ఎకరాల్లోనే వేస్తారనుకున్నా 1796 ఎకరాల్లో వేయడం గమనార్హం. ఈ గణాంకాలను పరిశీలిస్తే అన్నదాతలు వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లినట్లు స్పష్టమవుతోంది. అత్యధిక విస్తీర్ణంలో సాగైన వాటిలో శనగ తొలిస్థానంలో నిలిచింది.

ప్రాజెక్టుల కింద సైతం..

జిల్లాలో ప్రధానంగా రెండు ప్రాజెక్టులున్నాయి. వాటి కింద గతేడాది యాసంగిలో కంటే ఈసారి వరి విస్తీర్ణం తగ్గింది. సింగూర్ పరిధిలో పోయిన సంవత్సరం 20,982 ఎకరాలో సాగు చేయగా.. ఈసారి 7,092 ఎకరాలకే పరిమితమైంది. నల్లవాగు ప్రాజెక్టు కింద గడిచిన ఏడాదిలో 5,503 ఎకరాల్లో వేసిన వరి ...ఈసారి 3,571కు తగ్గిపోవడం గమనార్హం. ధాన్యం కొనబోమని ప్రభుత్వం చెప్పడంతో చాలామంది రైతులు వరి సాగుకు దూరమయ్యారు.

మా కృషితోనే ఇలా..

ప్రభుత్వ ఆదేశాలతో వరి సాగు వద్దంటూ సదస్సులు, సమావేశాల ద్వారా అన్నదాతల్లో చైతన్యం తీసుకొచ్చాం. మా శాఖ ప్రచారం కారణంగానే ఆ పంట విస్తీర్ణం తగ్గింది. ఇతర పైర్ల వైపు మొగ్గు చూపారు. అత్యధికంగా శనగ వేశారు. జొన్న, మొక్కజొన్న, తెల్లకుసుమ వంటి ప్రత్యామ్నాయాలను ఎంచుకున్నారు. చెరువులు, బోరుబావులతోపాటు ప్రాజెక్టుల పరిధిలోనూ వరి సాగుకు చాలామంది వెనుకాడటం క్షేత్రస్థాయి సిబ్బంది కల్పించిన అవగాహన ఫలితమే.– నర్సింహారావు, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు, సంగారెడ్డి

గరుడ వార్త




# జ్వరాల బారిన పల్లెలు

పెద్దపల్లి : వాతావరణ మార్పులు.. పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు.. వెరసి పల్లెలు జ్వరాల బారిన పడుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుందనే సొంత వైద్యం కూడా జ్వరాల తీవ్రతను పెంచుతోంది. భారీ వర్షాలు కురవడం.. ఆ వెంటనే తీవ్రమైన ఎండలతో ఉక్కపోత.. వెరసి ప్రజలు అస్వస్థత బారిన పడుతున్నారు. జిల్లాలోని వివిధ ఆస్పత్రులకు వస్తున్న రోగుల్లో 50-69 శాతం మంది జ్వర బాధితులే ఉంటున్నారు. ఒక్క పెద్దపల్లిలోని టీ హబ్‌కు వివిధ ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల నుంచి రోజుకు 150 నుంచి 200 నమూనాలు జ్వరాలకు సంబంధించినవే వస్తుండటం తీవ్రతను వెల్లడిస్తోంది. ఇందులో కనీసం 5 నుంచి 6 డెంగీ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. టీ హబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఆగస్టు 1 నుంచి ఇప్పటివరకు 94 డెంగీ కేసులు నమోదయ్యాయి.

పారిశుద్ధ్య లోపమే ప్రధాన కారణం

గ్రామాల్లో స్వచ్ఛత పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ



కార్యక్రమాలు పెద్దగా ప్రయోజనం ఇవ్వడం లేదు. పరిశుభ్రత పనులు ఫొటోలకే పరిమితం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. మురుగు బయటకు పంపించడం, నీరు నిలువకుండా ఇంకుడుగుంతలు నిర్మించడం వంటి పథకాలు కూడా కాగితాలకే పరిమితమవుతున్నాయి. కేవలం ప్రధాన రహదారులపై ఊడ్చటం, ముగ్గులు వేయడం వరకే స్వచ్ఛతా హీ సేవా జరుగుతోంది. అలాగే చెత్తను వేరు చేయడం, కంపోస్టు ఎరువుగా మార్చడం వంటి పనులు చేపడుతున్నారు. అయితే దోమలకు ఆవాసం కల్పించే ప్రధానమైన మురుగు నియంత్రణ మాత్రం సాధ్యం కావడం లేదు. పరిశుభ్రత అమలుకు నోచుకోవడం లేదు.

ఊరూరా వైద్య శిబిరాలు

గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తుండటంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ నియంత్రణ చర్యలు చేపట్టింది. తీవ్రతను అంచనా వేసేందుకు ఇంటింటి సర్వేతో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. ఒక్కో ఆరోగ్య కేంద్రం పరిధిలో వారానికి రెండు నుంచి మూడు శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. మారిన పరిస్థితులతో తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాల్లో రెండు నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఎలిగేడు మండలం ముప్పిరితోట, జూలపల్లి మండలం కేంద్రంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు.

# ఇళ్ల పంపిణీకి రంగం సిద్ధం

సిరిసిల్ల : జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తయి, వాటిలో మౌలిక వసతులు అందుబాటులో ఉన్న వాటిని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. దీనికోసం మండలాల వారీగా పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు, వాటికి వచ్చిన దరఖాస్తుల జాబితాలో అర్హులను గుర్తిస్తున్నారు. ఈ నెలాఖరు, వచ్చే నెలలో విడతల వారీగా ఇళ్ల పంపిణీ పూర్తి చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో పేదలకు ఇవ్వాలని పలు దశల్లో 6,886 రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ. 5.04 లక్షలు, పట్టణాల్లో రూ.5.30 లక్షల చొప్పున కేటాయించారు. ఇప్పటికీ 3,402 నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి రూ. 209 కోట్లు ఖర్చు చేశారు. సిరిసిల్ల పట్టణంలో మంగళవారం నాలుగో విడత లబ్ధిదారుల ఎంపిక జరిగింది. దీనిలో పెద్దూరు, రగుడులోని ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న అర్హుల్లో 516 మందిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఇంకా శాంతినగర్, మండెపల్లిలో 264 నిర్మాణాలు పూర్తయినవి ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లో నిర్మాణం పూర్తయిన వాటిలో సింహభాగం పంపిణీ జరిగింది. వేములవాడ నియోజకవర్గంలో వట్టెంల, వేములవాడ పట్టణంలో ఒక విడత పంపిణీ చేశారు. కోనరావుపేట, చందుర్తి, రుద్రంగిలో టెండర్ల దశలోనే ఉన్నాయి. ఇల్లంతకుంటలో నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారుల ఎంపిక కాలేదు.

మౌలిక వసతుల్లో జాప్యం

మౌలిక వసతుల కల్పనలో జాప్యం వల్ల రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ కావడం లేదు. ఇప్పటి వరకు పంపిణీ జరిగిన చోట అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, విద్యుత్తు, తాగునీటి వసతులు పూర్తయ్యాయి. చాలా చోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా, ఏదో ఒక సమస్యతో నిలిచిపోయాయి. సిరిసిల్ల పురపాలికకు మంజూరైన ఇళ్లకు పురపాలకశాఖ నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లోనే సమస్య ఉంది. తంగళ్లపల్లి మండలం జిల్లెలలో 20 ఇళ్లు పూర్తి చేశారు. అంతర్గత రహదారులు, విద్యుత్తు సౌకర్యం, మురుగు కాల్వల నిర్మాణం పూర్తయింది. కానీ ఆ గృహాలకు వెళ్లేందుకు రహదారి లేక లబ్ధిదారుల పరిశీలనకే పరిమితమైంది. ఇదే మండలంలోని రామన్నపల్లిలో మురుగు కాల్వలు లేక పంపిణీ ఆగిపోయింది. చాలా చోట్ల నిర్మాణాలు పూర్తి చేసినవి ఏళ్ల తరబడి పంపిణీకి నోచుకోకపోవడంతో ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి.

మూడింతల దరఖాస్తులు

ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన మండలాలు, గ్రామాల్లో ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. ఒక్కోచోట రెండు, మూడింతల దరఖాస్తులు వచ్చాయి. వాటన్నింటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు దఫాలుగా వడ పోశారు. లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన చోట అర్హులమైన తమకు ఇళ్లు కేటాయించడం లేదంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులపై లబ్ధిదారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన 11వ వార్డు కౌన్సిలర్ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమ వార్డుకు కేటాయించిన వాటిలో తక్కువ మందిని ఎంపిక చేశారని ఆరోపించారు. ఇతర కౌన్సిలర్లు సర్దిచెప్పడంతో నిరసన విరమించారు. మరికొన్ని చోట్ల గృహలక్ష్మి పథకంలో అవకాశం కల్పిస్తామని అర్హులకు నచ్చజెప్పుతున్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల పంపిణీపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను సంప్రదించగా గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో పరిశీలన జరుగుతుందన్నారు. త్వరలోనే అర్హులైన వారికి పంపిణీ చేస్తామన్నారు.

# సమష్టి కృషి.. ములుకనూర్ స్ఫూర్తి



హనుమకొండ : జిల్లా భీమదేవరపల్లి ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం... రైతులను ఆదుకోవడంలో ఆదర్శంగా నిలుస్తోంది. సాగుకు ఇబ్బంది లేకుండా ప్రోత్సహిస్తోంది. పలు విధాలుగా రుణాలు ఇచ్చి ఆసరాగా నిలుస్తోంది. రూ.వందల కోట్ల వ్యాపారంతో దూసుకుపోతోంది. కోట్ల రూపాయల విలువ గల స్థిరాస్తులు కలిగి ఉమ్మడి జిల్లాలోని మిగతా సంఘాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సంఘం 67వ మహాసభ నిర్వహిస్తున్న నేపథ్యంలో విజయ ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

ప్రత్యేకతలు..

ములుకనూర్ సహకార సంఘం 1956లో 137 మంది రైతులతో ప్రారంభమైంది. ఒక్కో మెట్టు ఎదుగుతూ ప్రస్తుతం 7,628 మంది సభ్యులతో రూ.362 కోట్ల విలువైన ఆర్థిక ప్రగతి సాధించింది. సంఘం పరిధిలోని 24 గ్రామాల్లో రూ.40 కోట్లకు పైగా స్థిరాస్తులు, 55,161 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 44 గోదాములు ఉన్నాయి. ఎకరాకు రూ.38 వేల పంట అప్పు ఇస్తారు. రుణాల రికవరిలోనూ ఉమ్మడి జిల్లాలో దీనిదే ప్రథమ స్థానం. 96 శాతం సభ్యులు సకాలంలో రుణాలు చెల్లిస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నారు. పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి లాభాలు సాధించింది.

5 లక్షల ఎకరాలకు విత్తనాల పంపిణీ

రైతులకు విత్తనాలు అందించేందుకు 1976లో విత్తనోత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించింది. ములుకనూరు, కొత్తపల్లి, రత్నగిరి, భీమదేవరపల్లి గ్రామాల్లో విత్తనోత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏటా 4 వేల ఎకరాల్లో విత్తనోత్పత్తి జరుగుతోంది. పండించిన విత్తనాలను శుద్ధి చేసి 5 లక్షల ఎకరాలకు ములుకనూరు సహకార విత్తనాలు అందజేసి ఏటా రూ.44 కోట్ల విత్తన వ్యాపారం చేస్తోంది. జై శ్రీరాం, ఆర్ఎన్ఆర్, బీపీటీ, ఎంటీయు రకాలను వర్షాకాలం, యాసంగి సీజన్లలో అందిస్తోంది. రూ.25 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు చేపట్టింది. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే వ్యాపారంలో వచ్చిన లాభాలను రైతులకు బోనస్ రూపంలో అందిస్తున్నారు. సన్న రకాల ధాన్యాన్ని సంఘానికి చెందిన రైస్ మిల్లు ద్వారా బియ్యంగా మార్చి వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తోంది.

నేడు 67వ వార్షిక మహాసభ

ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం 67వ వార్షిక మహాసభ 11 గంటలకు బ్యాంక్ పారా బాయిల్డ్ రైసుమిల్లు ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. సభ్యులందరు మహాసభకు బ్యాంక్ పాసుపుస్తకంతో హాజరుకావాలని సూచించారు.

రెండు పంటలకు సరిపడా ఎరువుల నిల్వయాసంగి, వర్షాకాలం పంటలకు సరిపడా ఎరువులను నిల్వ చేయడం ఇక్కడ ప్రత్యేకత. దేశ వ్యాప్తంగా ఎరువుల కొరత ఉన్నా ఇక్కడ మాత్రం ఆ సమస్య రాదు. సంఘ పరిధిలో 20వేల ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారు. వర్షాకాలం సీజన్‌లో రూ.5.93 కోట్ల విలువ చేసే 80 వేల బస్తాల ఎరువులు విక్రయించారు. రెండో పంటకు సరిపడా ఎరువులు డీఏపీ, కాంప్లెక్స్, యూరియా పోటాష్ ఉన్నట్లు సంఘ అధికారులు తెలిపారు.

# సమయం లేదు మిత్రమా!

కరీంనగర్ : అయిదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల కల నెరవేరింది.. రాష్ట్ర ప్రభుత్వం టీచర్ రిక్రూట్‌మెంట్ (టీఆర్టీ) ప్రకటనను విడుదల చేసింది.. దరఖాస్తుల ప్రక్రియ కూడా మొదలైంది. ఈసారి ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో మొత్తం 393 పోస్టులు భర్తీ కానున్నాయి. తక్కువ సంఖ్యలో పోస్టులు ఉండటం, టీఆర్టీకి హాజరయ్యే వారి సంఖ్య 15వేలకు పైగా ఉండటంతో తీవ్ర పోటీ నెలకొననుంది. మరో వైపు టీఆర్టీ పరీక్షలు నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. దీంతో పరీక్షలకు రెండు నెలల సమయమే ఉండటం, అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో ఉద్యోగ సాధనకు అభ్యర్థులు శ్రమించాల్సిందే. ఉన్న కొద్ది సమయంలో ప్రణాళికతో చదివితేనే ఉద్యోగాలు సాధించవచ్చని 2017 టీఆర్టీలో ప్రతిభ చాటిన అభ్యర్థులు పేర్కొంటున్నారు.

నిపుణుల సూచనలివీ..

సమయం తక్కువుంది. ఉన్న 60 రోజుల సమయానికి అనుగుణంగా సిలబస్‌ను విభజించుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నిర్ణీత సమయంలో చదవడం, పునశ్చరణ పూర్తి చేయాలి.

రోజుకు 10 గంటలకు తక్కువ కాకుండా చదివితేనే ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోగలరు.

గతంలో నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. ఎప్పటికప్పుడు ముఖ్యమైన అంశాలపై నోట్స్ తయారు చేసుకోవాలి.

స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు అభ్యర్థులు ఇంటర్ వరకు, ఎస్జీటీ ఉద్యోగాలకు పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్ణంగా చదివి అవగాహన పెంచుకోవాలి.

రెండు విభాగాలకు అదనంగా జీకే, సమకాలీన అంశాలు చదవాలి. దిన పత్రికలను చదవడం, క్రీడలు, అవార్డులు, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని ప్రగతి, వర్తమాన రాజకీయాలు, కమిటీలు, రాష్ట్ర, జాతీయ చిహ్నాలు, అంతరిక్ష, అణుసాంకేతిక అంశాలు, జనాభా, దేశాలు, రాజధానులు, కరెన్సీ వంటి అంశాలను ఆధ్యయనం చేయాలి. ఇందుకు రోజుకు కొంత సమయాన్ని కేటాయించాలి.

తక్కువ సమయం ఉందని ఒత్తిడికి గురికావొద్దు. మధ్యమధ్యలో విరామమిస్తూ చదవడం ద్వారా చదివింది బాగా గుర్తు పెట్టుకోవచ్చు. రోజూ ఉదయం కొంతసేపు యోగా చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించొచ్చు.

ఆహారం విషయంలోనూ జాగ్రత్త తీసుకోవాలి. వీలైనంత వరకు ఇంటి ఆహారం తీసుకోవాలి. వీలులేని వారు వేడి ఆహారం తీసుకోవడం అవసరం. దీనివల్ల ఆరోగ్యం పాడు కాకుండా జాగ్రత్త పడొచ్చు. చదువుకునే సమయంలో స్నాక్స్‌గా జంక్‌ఫుడ్ తినడం కన్నా పండ్లు, లేదా డ్రైఫ్రూట్స్ తీసుకోవాలి.

ఎక్కువ సాధన చేయండి

2017 టీఆర్టీలో 5వ ర్యాంకు సాధించా. అంతకుముందు జరిగిన పరీక్షల ప్రశ్నపత్రాలను, సొంతంగా తయారు చేసుకున్న నోట్స్‌ను ఎక్కువగా సాధన చేశాను. తెలుగు అకాడమి వారి పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను క్షుణ్ణంగా చదివా. ఇప్పుడు టీఆర్టీకి తక్కువ సమయం ఉన్నందున కొత్తవాటి జోలికి అభ్యర్థులు వెళ్లకుండా చదివిన వాటినే ఎక్కువ సాధన చేయాలి. పెడగాజిలో ఫర్‌ఫెక్ట్ ఎడ్యుకేషన్ కోసం ఒక పుస్తకాన్ని, అందులో ప్రతి అంశాన్ని చదవాలి. భావ కవిత్వాలపై ప్రధాన దృష్టి సారించాలి. కవులను యుగంగా విభజించుకుని గుర్తుపెట్టుకునేలా దృష్టి నిలపాలి. ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారనే దాన్ని గుర్తించి ప్రత్యేకంగా సాధన చేయాలి.

ఎం.నరేశ్, స్కూల్ అసిస్టెంట్(తెలుగు), ఆత్మకూర్

సమగ్రంగా చదవాలి

టీఆర్టీలో రాష్ట్రంలో 104వ ర్యాంకు సాధించా. పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు అప్పుడు ఎక్కువ సమయం ఉంది. నిత్యం 10 గంటలకుపైగా చదివాం. పాఠ్య పుస్తకాలను ఎక్కువగా సాధన చేశా. ఇప్పుడు సమయం తక్కువ ఉన్నా అభ్యర్థులు పుస్తకాలు సమగ్రంగా చదివి అవగాహన పెంచుకోవాలి. కంటెంట్, మెథడ్స్‌తోపాటు విద్యా దృక్పథాలు, జీకే, సమకాలీన అంశాలపై సమాంతరంగా సన్నద్ధమవ్వాలి. కరంట్



అఫైర్స్‌లో వచ్చే అంశాలకు లింక్ ఉండే పూర్వపు అంశాలను జీకేగా అడిగే అవకాశమున్నందున వాటిపై దృష్టి నిలపాలి. పరీక్షకు కనీసం 10 రోజుల ముందు నుంచి ఓ వైపు చదువుతూనే పునశ్చరణ, ప్రాక్టీస్ టెస్టులకు సమయం కేటాయించు కోవాలి. ప్రశ్న అడిగే విధానం మారినందున అంశాలపై సమగ్ర అధ్యయనం అవసరం.

ఇరుగాల ప్రశాంత్, ఎస్జీటీ, గర్షకుర్తి

ప్రాథమిక భావనలపై పూర్తి అవగాహన

టీఆర్టీలో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకును సాధించా. ప్రణాళికతో చదవడంతోపాటు అన్ని పాఠ్యాంశాల ప్రాథమిక భావనలపై పూర్తి అవగాహన పెంచుకుని పరీక్షకు సన్నద్ధమయ్యా. ప్రాథమిక భావనలపై ఎక్కువ ప్రశ్నలు అడిగే ఆస్కారం ఉన్నందున అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించాలి. పాఠశాల స్థాయి సిలబస్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి. బారు వడ్డీ, చక్రవడ్డీ, లాభనష్టాలు, బహుపదులు, త్రికోణమితి, రేఖాగణితం, సాంఖ్యక శాస్త్రం, శ్రేఢులు, సమితులు, క్షేత్రమితిలపై ఎక్కువ ధ్యాస పెట్టాలి. మెథాడలజీలో లక్ష్యాలు- స్పష్టీకరణలు, ఉద్దేశాలు, విలువలు, బోధన పద్ధతులు, బ్లూమ్స్ వర్గీకరణ, బోధన ఉపకరణ సామగ్రి, ఐసీటీ, మూల్యాంకనంపై అవగాహన పెంచుకోవాలి. పరీక్ష రాసేప్పుడు అనవసర తప్పిదాలు లేకుండా చూసుకోవాలి.

భగత్, స్కూల్ అసిస్టెంట్(గణితం), పోతారం

సొంతంగా నోట్స్ రాసుకుంటూ..

టీఆర్టీలో రాష్ట్ర స్థాయిలో 73వ ర్యాంకు సాధించా. సిలబస్‌ను సమయానికి అనుగుణంగా విభజించుకుని ప్రణాళికతో చదవాలి. జీకే, సమకాలీన అంశాలు, పర్‌ఫెక్టివ్ ఎడ్యుకేషన్ అండ్ టీచింగ్ టెక్నాలజీ, ఫిజికల్ సైన్స్ కంటెంట్‌లకు ఎక్కువ సమయం కేటాయించాలి. 6-10వ తరగతి పాఠ్యాంశాలను సమగ్రంగా చదివి అవగాహన పెంచుకోవాలి. ప్రతి పాఠ్యాంశం చదవగానే దానికి సంబంధించిన ప్రాక్టీస్ పేపర్స్ చేయాలి, షార్ట్‌నోట్స్ తయారు చేసుకోవాలి. ఫిజిక్స్‌లో సమస్యల సాధన ఎక్కువగా చేయాలి. ప్రభుత్వ ప్రచురణల పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. తక్కువ సమయం ఉన్నందున అభ్యర్థులు ప్రతి పాఠ్యాంశానికి సొంతంగా షార్ట్‌కట్స్, బిట్స్ రాసుకుంటూ పునశ్చరణ చేసుకోవాలి.

బొప్ప జ్యోతి, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్), ధర్మపురి

పాఠ్య పుస్తకాల అధ్యయనం కీలకం

టీఆర్టీలో రాష్ట్రంలో 3వ, ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకును సాధించా. సిలబస్ ఆధారంగా ప్రణాళికతో పాఠ్య పుస్తకాలన్నింటిని చదివి పూర్తి స్థాయిగా అప్పుడు సిద్ధమయ్యాను. ఇప్పుడు సమయం తక్కువున్నా ఇప్పటికే అభ్యర్థులు చదువుతుంటారు కాబట్టి పాఠ్య పుస్తకాలు చదవడం కచ్చితంగా పూర్తి చేయాలి. అత్యధిక ప్రశ్నలు సాంఘిక శాస్త్రం కంటెంట్, మెథడాలజీవే ఉంటాయి. అభ్యర్థులు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు పుస్తకాలను లోతుగా చదవాలి. ఒక అంశాన్ని లేదా ఒక పాఠాన్ని మరోదానితో అనుసంధానం చేస్తూ అర్థం చేసుకోవాలి. ఉన్న సమయానికి అనుగుణంగా ప్రణాళికతో సిద్ధమవ్వాలి. మందపల్లి గంగాధర్, స్కూల్‌అసిస్టెంట్ (సాంఘికశాస్త్రం) తిమ్మాపూర్

# ఎన్‌క్వాస్ గుర్తింపు..సేవల విస్తరణకు చేయూత

ఇబ్రహీంపట్నం : ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను జాతీయ వైద్య బృందం గుర్తించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్వాస్) గుర్తింపు అందిస్తున్నాయి. గత నెలలో జిల్లాలో జాతీయ వైద్య బృంద సభ్యులు ఇబ్రహీంపట్నంలోని వేములకుర్తి, జగిత్యాల మండలంలోని ధరూర్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న ఉత్తమ సేవలు, కేంద్రాల్లో వసతులు, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వారి పరిశీలనలో రెండు ఆరోగ్య కేంద్రాలు అన్ని ప్రమాణాలను పాటించడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

వేములకుర్తి, ధరూర్ ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ వైద్య బృందం గత నెలలో పర్యటించారు. ఆయా కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలు, మందులనిల్వ, రికార్డుల




నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును, గర్భిణుల నమోదు, వారికి అందిస్తున్న చికిత్స, ఓపీ సేవలు, ఐసీడీఎస్, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామంలో అవగాహన కార్యక్రమాల నిర్వహణ, అత్యవసర సేవలు వంటి అంశాలను పరిశీలించారు. రోగులతో కూడా స్వయంగా మాట్లాడి సిబ్బంది అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వారి అధ్యయనంలో వేములకుర్తి కేంద్రానికి 82 మార్కులు, ధరూర్ కేంద్రానికి 79 మార్కులు రావడంతో ఎన్‌క్వాస్ గుర్తింపు అందించారు.

మూడేళ్ల పాటు నిధులు

సొంత భవనం ఉండి, పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో ఎన్‌క్వాస్ బృందం పర్యటించడానికి ప్రాధాన్యం ఇస్తారు. ఎన్‌క్వాస్ బృందాల పరిశీలన ప్రక్రియ నిరంతరం ఉంటుంది. ఇందులో గుర్తింపు పొందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల అభివృద్ధి కోసం మూడేళ్ల పాటు నిధులను కేటాయిస్తుంది. ఆయా కేంద్రాలకు కేటగిరీల ప్రకారంగా నిధులను కేటాయిస్తారు. వేములకుర్తి, ధరూర్ కేంద్రాలకు ఏడాదికి రూ.1.26 లక్షల చొప్పున మూడేళ్ల పాటు నిధులను మంజూరు చేస్తారు. దీంతో ఆయా ఆరోగ్య కేంద్రాలు మరింత అభివృద్ధి చెందనున్నాయి.

మరిన్ని సౌకర్యాలు..

జిల్లాలో వేములకుర్తి, ధరూర్ ఆరోగ్య కేంద్రాలు ఎన్‌క్వాస్ గుర్తింపు పొందాయి. దీంతో ఆయా కేంద్రాలకు మూడేళ్ల పాటు నిధులు మంజూరవుతాయి. దీంతో ఆయా కేంద్రాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, గ్రామీణ ప్రజలకు మరిన్ని సేవలను అందించవచ్చు. ఎన్‌క్వాస్ బృందం పరిశీలన నిరంతరం జరుగుతుంది. జిల్లాలో మిగిలిన ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయితే ఆయా కేంద్రాల్లో జాతీయ వైద్య బృందం పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే ఎన్‌క్వాస్ గుర్తిస్తుంది.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

# కుక్కల బెడద.. పరిష్కారమే లేదా?

కరీంనగర్: జిల్లా కేంద్రంలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రయితే కాలనీవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కుక్కల బెడద తొలగించాలని సర్వసభ్య సమావేశంలో పాలకవర్గ సభ్యులు కోరుతున్నా.. పరిష్కారం కావడం లేదు.

ఏబీసీ నిబంధనలు కఠినం

ఎనిమిల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ప్రోగ్రాం, జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా వీధి కుక్కల నియంత్రణకు నియమ, నిబంధనల్లో మార్పులు చేయడంతో నగర, పురపాలికలకు నిర్వహణ కఠినంగా మారింది. కుక్కలను పట్టుకోవడం, శస్త్ర చికిత్సలు చేసే ఏజెన్సీకి కచ్చితంగా ప్రాజెక్టు గుర్తింపు ఎక్కడ పని చేస్తే అక్కడిదే తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ గుర్తింపు రావాలంటే ఏబీసీ సెంటర్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి. ప్రత్యేకంగా కిచెన్ గది, డాక్టర్ రూం, ఆపరేషన్ థియేటర్, ప్రిపరేటరీ గది, పని చేసే వర్కర్స్ గది వంటివి ఉండాలి. 50 నుంచి 60 వరకు క్యాటిల్ షెడ్డు ఉండాలి. ఇవన్నీ ఏర్పాటు చేయాలంటే నిధులతో ముడిపడి ఉంటుంది.

తాత్కాలిక నిర్మాణాలేవీ?జంతు సంరక్షణ బోర్డు నిబంధనలు అమలు చేయడం కత్తి మీద సాముగా మారింది. తాత్కాలికంగా శస్త్రచికిత్స చేసేందుకు ప్రస్తుతమున్న చోటనే క్యాటిల్ షెడ్లు నిర్మించాలని గతంలోనే ఇంజినీరింగ్ అధికారులకు అప్పటి కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా పట్టింపు లేకుండా ఉంటున్నారు. మరో వైపు ఇళ్ల మధ్య ఉండటంతో అభ్యంతరాలు వస్తున్నాయి.

అంచనాలకు అందని లెక్కలు

నగరపాలక సంస్థకు శాశ్వతంగా జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు రామగుండం బైపాసు రోడ్డులో ఎకరం స్థలం కేటాయించారు. అక్కడ ఏబీసీ నిబంధనల ప్రకారం భవనం నిర్మించాల్సి ఉంటుంది. ప్రహరీ నిర్మించేందుకు అంచనాలు తయారు చేయగా భారీ మొత్తం కావడంతో నిధుల సమస్య ముందుకొచ్చింది. నగరంలోని 60 డివిజన్లలో సుమారు పది వేల వరకు ఉన్నట్లు అనధికారిక లెక్కలను బట్టి తెలుస్తోంది.

'దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్య ఉండడాన్ని సుప్రీంకోర్టు తనంత తానుగా విచారణ చేపట్టాలని అత్యున్నత న్యాయస్థాన సీనియర్ న్యాయవాది ఇటీవల కోరారు. శునకాలతో ఎదురవుతున్న ఇబ్బందుల విషయంలో ఏం చేయగలమో తర్వాత చర్చిద్దామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పేర్కొన్నారు.'

మంకమ్మతోటలో ఓ ఉద్యోగి రాత్రి 11 గంటలకు ఇంటికి వెళుతుండగా పాతిక సంఖ్యలో కుక్కలు వెంటపడ్డాయి. ఆయన భయంతో పరుగు తీశాడు. ద్విచక్రవాహనాలపై వెళ్తున్నా వెంబడిస్తుండటంతో ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల అంబేద్కర్ స్టేడియంలో ఇద్దరు మహిళలు నడుచుకుంటూ వస్తుండగా నాలుగైదు కుక్కలు వారిని కొద్దిదూరం వరకు అనుసరించాయి. ఆ తర్వాత దగ్గరకు రావడంతో భయపడి అవి వెళ్లే వరకు నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ఎదుగుదల లేని పంటలు

వరంగల్ : వర్షాభావ పరిస్థితులు అన్నదాతను కలవరపెడుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. వాతావరణంలో సమతుల్యత లోపించింది. కురిస్తే కుంభవృష్టి లేదంటే అనావృష్టి. ఈ రెండింటితోనూ పంటలకు నష్టమే. సమయానికి వర్షాలు ముఖం చాటేస్తున్నాయి. అనవసర వేళ కుంభవృష్టితో రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. వానాకాలం సీజన్‌లో జులైలో అధిక వర్షపాతం, జూన్, ఆగస్టులో తక్కువ వర్షపాతం నమోదై పంటల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపింది. పత్తి, మొక్కజొన్న పూత కాత వచ్చినా.. బలంగా లేవు. సెప్టెంబర్‌లో అడపాదడపా పడటం కొంతమేర పంటలకు మేలు జరుగుతోంది. బోర్లు, బావులున్న వారికి ఇబ్బంది లేదు. వర్షాలు తగ్గడం, ఉష్ణోగ్రతలు వేసవిని తలపించేలా భగ్గు మని ఆరుతడి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, కంది పంటలకు నష్టం వాటిల్లుతోంది. నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో ఎండిపోతున్నాయి.

ప్రకృతి వైపరీత్యం..

సాధారణ సాగు విస్తీర్ణం 2,42,000 ఎకరాలు కాగా 2,32,290 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. జులైలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 1,084 ఎకరాల్లో పత్తి, వరి పంటలకు నష్టం జరిగింది. నష్టం విలువ రూ.1.08 కోట్లుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పుడు వర్షాభావంతో పంటలు ఎండి పోతున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో ఆగస్టులో ఏర్పడిన అనావృష్టి సాగును దెబ్బతీసింది. సెప్టెంబర్ 21వ తేదీ వరకు లోటు వర్షపాతం ఉంది. జూన్, జులైల్లో సాగుచేసిన పంటలు ఆగస్టులో ఎదుగుదలకు వస్తాయి. ఈ సమయంలోనే ఆశించిన మేర వర్షాలు కురవలేదు. ప్రధానంగా జిల్లాలోని భీమదేవరపల్లి, వేలేరు, ఎల్కతుర్తి, కమలాపూర్, హసన్‌పర్తి, ధర్మసాగర్, పరకాల, శాయంపేట, అత్మకూరు మండలాల్లో లోటు వర్షపాతం కారణంగా పంటలకు ఇబ్బంది ఏర్పడింది. వర్షాభావ పరిస్థితులకు తోడు పత్తి పంటపై పలు రకాల చీడపీడలు ఆశించి పూత, పిందేలకు నష్టం కల్గుతోంది.

జిల్లాలో మోస్తరు వర్షం

జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో పదిరోజుల నుంచి ఎండ వేడిమికి తల్లడిల్లుతున్న జనానికి ఉపశమనం లభించింది. గురువారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. ఐనవోలులో 33.6 మి.మీ, వేలేరులో 21.3, కాజీపేటలో 15.2, శాయంపేటలో 12.7, ఆత్మకూరులో 9.7, భీమదేవరపల్లిలో 8.1, కమలాపూర్‌లో 7.1, పరకాలలో 6.4, దామెర 5.0, ఎల్కతుర్తిలో 3.0 నడికుడలో 3.0 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

మొక్కజొన్నకు తీవ్ర నష్టంతోట రవీందర్. సింగారం

వర్షాధారంగా రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. జులై వరకు బాగానే పెరిగింది. ఆగస్టులో వర్షాలు లేక పోవడంతో గిడసబారిపోయింది. రెండు మూడు అడుగుల వరకు పెరిగి పూత,పీచు వచ్చింది. దీంతో పంటను తీసివేశాను. రెండో పంటగా కూరగాయల సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నాను.

పత్తి పంటలో సమస్యలుచాగంటి శ్రీనివాస్. మల్లక్‌పల్లి

ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పత్తి పంటలో సమస్యలు ఎక్కువయ్యాయి. పత్తి మొక్కలు కేవలం రెండు అడుగుల లోపే పెరిగి పూత, కాత వస్తుంది. దీంతో కనీస దిగుబడి రాదు. పలురకాల తెగుళ్లు, చీడపురుగుల దాడి పెరిగింది. పూత, కాత రాలిపోతుంది.

# చినుకులే దిక్కు.. పంటలెలా దక్కు!

వరంగల్ : ఈ ఏడాది జిల్లాలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కురిస్తే కుంభవృష్టి.. లేదంటే అనావృష్టి అన్నట్లుంది. రెండు విధాలా అన్నదాతకు నష్టాలు తప్పడం లేదు. వాతావరణంలో లోపించిన సమతుల్యత పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కురవాల్సిన సమయంలో వర్షాలు ముఖం చాటేశాయి. ఈ సీజన్ జులైలో సాధారణం కంటే 186 శాతం అధిక వర్షపాతం నమోదైంది. తరవాత ఆగస్టులో వర్షాభావ పరిస్థితి ఏర్పడింది. ఎండల తీవ్రత కూడా పెరిగింది. నీటి తడులు అందకపోవడంతో మొక్కలు గిడసబారాయి. పెరుగుదల లేకుండానే పత్తికి పూత, మొక్కజొన్న కాత వచ్చాయి. ఈ నెలలో అడపాదడప కురుస్తున్న వర్షాలు పంటలకు కొంతమేరకు మేలు చేస్తున్నాయి.

దెబ్బతీసిన ఆగస్టు....

ఆగస్టులో వర్షాభావ పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. సాధారణం కన్నా 70 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. అలాగే ఈ నెలలో 21వ తేదీ వరకు కూడా 23 శాతం లోటు వర్షపాతమే నమోదు అయింది. వర్ధన్నపేట, ఖిలావరంగల్, గీసుకొండ, సంగెం, రాయపర్తి, నర్సంపేట, ఖానాపూర్, దుగ్గొండి, నల్లబెల్లి, చెన్నారావుపేట మండలాల్లో లోటు వర్షపాతం ఉంది.

ఎదుగుదల లోపించింది

రైతు : పాకనాటి సారయ్య, గీసుకొండ

ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు : మొత్తం 11 ఎకరాల్లో సాగు. ఐదెకరాల్లో మొక్కజొన్న, నాలుగు ఎకరాల్లో పత్తి, రెండెకరాల్లో వరి.

పెట్టుబడి : పత్తి ఎకరానికి రూ.40 వేలు, మొక్కజొన్నకు రూ.30 వేలు, వరికి రూ.30 చొప్పున.

ప్రస్తుతం పంటల పరిస్థితి: సరైన వర్షాల్లేక మొక్కజొన్న పంటలో ఎదుగుదల లోపించింది. సాధారణంగా ఎనిమిది అడుగుల ఎత్తు పెరగాల్సిన మొక్క కేవలం నాలుగు అడుగులే పెరిగి, కంకులు చిన్నగా ఉన్నాయి. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిఉండగా.. క్వింటాళ్లు మించేపరిస్థితి లేదు. పత్తి చేలు మొదట దెబ్బతిన్నా తరవాతి వర్షాలకు కోలుకుంది.

ఎరుపు రంగు తెగులు..

బానోత్ నర్సింహ, అమృతండా (చెన్నారావుపేట)

1.10 ఎకరాల్లో పత్తి

ఎకరాకు రూ.30 వేలు

మొదట్లో వర్షాల్లేక వేసిన విత్తనాలు మొలకెత్తక నష్టం వాటిల్లింది. తరవాత భారీ వర్షాలతో మొక్కలు కొట్టుకుపోయాయి. మిగిలిన మొక్కలకు ఎరువులు వేసి బతికించుకున్నారు. వర్షాభావ పరిస్థితులతో పంట ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి పంటలో కలుపు అధికంగా పెరిగింది. ఎర్రతెగులు సోకి ఆకులు ఎర్రబారాయి. మొక్కల ఎదుగుదల ఆగిపోయింది.

కోలుకునే పరిస్థితి లేదు..

ఉడుత రమేష్, నల్లబెల్లి

ఐదున్నర ఎకరాల్లో పత్తి. వరుస వర్షాలతో రెండెకరాల్లో జాలు పట్టి పంట పనికి రాకుండా పోయింది.

రూ.1 లక్ష గతంలో వడగండ్ల వానలతో పంట నష్టపోయారు. ఇటీవల వర్షాలు వరుసగా కురుస్తుండటంతో పొలం జాలుపట్టి పంట ఎదుగుదల లేకుండా పోయింది. మిగిలిన మూడున్నర ఎకరాల్లో మొక్కల ఎదుగుదల లేదు. దిగుబడి రాక పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. తెగుళ్ల సోకాయి.

జిల్లాలో మోస్తరు వర్షం

వరంగల్ జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం కూడా చల్లబడింది. గత పదిరోజుల నుంచి ఎండలతో అవస్థలు పడుతున్న జనానికి ఉపశమనం కలిగింది.

# ద్రవరూప ఎరువు.. సాగుకు ఆదరువు



కౌడిపల్లి: ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తాడు రైతు. సరైన దిగుబడులు అందక నష్టపోతుంటాడు. ఈ సమస్యల నుంచి గట్టెక్కించడంతో పాటు సాగును లాభాలమయం చేయాలన్న కృతనిశ్చయంతో కృషి జరుగుతోంది. పెట్టుబడి తగ్గించి లాభసాటి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. అన్ని పంటల్లో జీవన ఎరువుల ఆవశ్యకతను వివరిస్తూ వినియోగానికి అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రం పలు పరిశోధనలతో నాణ్యమైన ద్రవరూప ఎరువులను తయారుచేస్తూ రైతులకు అందిస్తుండటం విశేషం. తునికి గ్రామ శివారులో ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు నెలల క్రితం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధుల కింద రూ.55 లక్షలు వెచ్చించి అత్యాధునిక జీవ నియంత్రణ ప్రయోగశాలను నెలకొల్పారు. మార్కెట్ ధర కంటే తక్కువకే ద్రవరూపంలో జీవ ఎరువులను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడి శాస్త్రవేత్తలు ద్రవరూపంలోని జీవ ఎరువులను తయారు చేస్తూనే రైతులకు వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. రసాయనాలు తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. ఇటీవల పాలనాధికారి రాజర్షిషా, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ ప్రయోగశాలను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించి దిశానిర్దేశం చేశారు. కేవీకే హెడ్ డాక్టర్ నల్కర్, ప్రొడక్షన్ మేనేజర్ హింగె, ల్యాబ్ ఇన్‌ఛార్జి శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో ఉత్పత్తి జరుగుతోంది.

అందుబాటులో ఇవే..కేవీకేలో ప్రస్తుతం ఏడు రకాల ద్రవరూపం ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

రైజోబియం

అజటోబ్యాక్టర్

అజోస్ప్రెరిల్లమ్

ఫాస్పరస్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా

మైకో రైజా

పొటాషియాన్ని విడుదల చేసే బ్యాక్టీరియా

జింక్‌ను కరిగించే బ్యాక్టీరియా

ఏయే పంటల్లో..

పప్పు, నూనె పంటలతో పాటు అన్ని రకాల కూరగాయలు, పండ్ల తోటల్లో ద్రవ రూపంలోని జీవ ఎరువులను వాడుకోవచ్చు. జొన్న, వరి, మొక్కజొన్న, చెరకు, గోధుమ, పత్తి పంటల్లోనూ వేసుకోవచ్చు. విత్తన శుద్ధికి ఎంచక్కా ఉపయోగించుకోవచ్చు.

ఉపయోగాలు

జీవ ఎరువుల వాడకం వల్ల భూసారం పెరుగుతుంది. నాణ్యమైన దిగుబడులకు అవకాశం ఉంటుంది. నేలలోని పోషకాల సమతుల్యత దెబ్బతినకుండా కాపాడుతుంది. జీవ ఎరువుల సిఫారసు మేరకు అన్ని పంటల్లో వినియోగించవచ్చు. మొక్క ఎదుగుదలకు దోహదపడుతుంది. ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మపోషకాలైన జింక్ సమృద్ధిగా అందుతాయి. వివిధ రకాల హార్మోన్లు, యాంటిబయాటిక్స్‌ను ఉత్పత్తి చేయడం వల్ల మొక్కలకు తెగుళ్లు సోకకుండా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

లీటరు రూ.160

మార్కెట్‌లో వివిధ రకాల జీవ ఎరువులు లభిస్తున్నాయి. వాటన్నింటి కంటే తక్కువ ధరకే అందిస్తున్నారు. నాణ్యత ప్రమాణాల మేరకు తయారు చేస్తున్నారు. లీటరుకు రూ.160 చొప్పున రైతులకు అందిస్తున్నారు. అవసరమైన వారు నేరుగా కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్లి కొనుగోలు చేయవచ్చు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం

ద్రవ రూప జీవ ఎరువులతో రైతులకు ఎన్నో విధాలుగా ప్రయోజనాలు ఉన్నాయి. సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన దిగుబడులను ఉత్పత్తి చేసుకోవచ్చు. మొక్కల ఎదుగుదల ఎక్కువగా ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఉత్పత్తి చేస్తున్నాం. ఈ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. సలాహాలు, సూచనలు కావాలంటే నేరుగా కేంద్రంలోని శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చు.

రవికుమార్, శాస్త్రవేత్త, ల్యాబ్ ఇన్‌ఛార్జి

# కాటికెళ్లినా తప్పని పాట్లు!



జనగామ : చివరి మజిలీలోనూ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బంధువులు, కుటుంబ సభ్యుల అంత్యక్రియల కోసం శ్మశానవాటికలకు వెళ్లిన వారికి అక్కడ కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మృతుల ఆఖరి ప్రయాణం గౌరవంగా జరగాలన్నది అందరి ఆకాంక్ష. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో, పట్టణాల్లో వైకుంఠధామాల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తోంది. శ్మశాన వాటికల్లో తగిన సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులను సమకూరుస్తోంది. పల్లెకో వైకుంఠధామం ఉండేలా చర్యలు చేపట్టింది. పురపాలికలు, నగరపాలికల్లో ఆదర్శ వైకుంఠ ధామాల నిర్మాణానికి రూ.కోటి చొప్పున ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని వైకుంఠధామాల పరిస్థితి, సదుపాయాలపై పరిశీలన చేపట్టింది.

పట్టణాల్లో అధ్వానం

జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు ఉన్నాయి. కొందరు మృతదేహాలను ఖననం చేస్తుండగా.. మరికొందరు దహనం చేసే సంప్రదాయం ఉంది. కొందరు చెరువులు, కుంటల సమీపంలో, కొందరు సొంత వ్యవసాయ భూముల వద్ద త్యక్రియలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఆరు హిందు, ఒక క్రైస్తవ, ఒక ముస్లిం, మైనార్టీ వర్గాలకు ఒక్కొక్కటి చొప్పున శ్మశాన వాటికలున్నాయి. ప్రిస్టన్ విద్యాలయం వెనుక క్రైస్తవులకు నిర్దేశించిన ఆఖరి మజిలీకి రూపం లేదు. స్థలం ఆక్రమణల పాలైంది. ఉన్న కొద్ది పాటి స్థలంలో వాటిక అభివృద్ధికి రూ.10 లక్షలతో పనులు ప్రతిపాదించి ఏళ్లు గడుస్తున్నా ప్రతిపాదన దశలోనే ఉన్నాయి..

నెహ్రూపార్కు సమీపంలోని శ్మశానవాటికలో జనగామ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొన్ని పనులు, మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రహరీ, సీసీ రోడ్లు, దహన వేదికలను నిర్మించారు. రూ.20 లక్షలతో కరోనా సమయంలో గ్యాస్ ఆధారిత దహనవాటికను నిర్మించారు. మరో రూ.10 లక్షలను ఇతర పనులకు ఖర్చు చేసినా వాడుకలో లేవు. గతంలో నిర్మించిన స్నానఘట్టం, మూత్రశాలలు, అస్థికలను భద్రపర్చే గది నిర్వహణ లేక అధ్వానంగా ఉన్నాయి. చినుకుపడితే జలమయంగా మారుతున్నాయి. రూ.కోటితో శ్రీరాంనగర్ మూలోని కుంటలో చేపట్టిన వైకుంఠధామం నిర్మాణ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. సుమారు రూ.50 లక్షల పని జరిగినా, రూపాయి బిల్లు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. గోరీలగడ్డ వాటిక ఇళ్ల మధ్యలో ఉందని తాళం వేశారు. ధర్మకంచ, మార్కెట్‌యార్డు వెనుక వైకుంఠధామాల్లో సమస్యలు ఉన్నాయి.

నీటి సౌకర్యం లేక ఇబ్బందులు

కొడకండ్ల మండలం జీబీ తండా, లక్ష్మక్కపల్లి, పాఖాల, రంగాపురంలోని వైకుంఠధామాలు గ్రామాలకు దూరంగా ఉండడంతో ప్రజలు వారికి అనుకూలమైన స్థలాల్లో అంత్యక్రియలు కొనసాగిస్తున్నారు. చెరువుముందు తండాలోని వైకుంఠధామం చెరువు మధ్యలో ఉండడంతో దారి లేదు. కొడకండ్లలో శ్మశానవాటికను వాగు ఒడ్డున నిర్మించడంతో.. వరద ఉద్ధృతికి ప్లాస్టిక్ ట్యాంక్ కొట్టుకు పోయింది. నీటి వసతి లేకపోవడంతో పక్కనున్న వాగు నీటితోనే ప్రజలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. కొడకండ్ల, రామేశ్వరం, మైదం చెరువుతండా, ఏడునూతుల వైకుంఠధామాల్లో విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో బోరు నీటిని వినియోగించుకునే పరిస్థితి లేదు.

జల దిగ్బంధంలో..

దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌కు చెందిన వైకుంఠధామాన్ని చెరువు శివారులో నిర్మించారు. చెరువు నిండిన ప్రతిసారీ వైకుంఠధామం చుట్టూ నీరు చేరుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో యశ్వంతాపూర్ వాగులో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి వైకుంఠధామం చుట్టూ ఎత్తుగా కట్టను నిర్మిస్తే ఉపయోగంలోకి వస్తుందని గ్రామస్థులు కోరుతున్నారు.

తలుపులు లేని స్నానపు గదులు

బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో.. నారాయణపురానికి వెళ్లే రహదారిలోని శ్మశానవాటికలో స్నానాల గదులకు తలుపులు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు బాగా పెరిగాయి. అధికారులు స్నానాల గదులకు తలుపులు ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి

జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలున్నాయి. నీరు, విద్యుత్తు సదుపాయాలున్నాయి. దహన క్రియలకు అనుమతి ఉంది. ఖననం, సమాధి నిర్మాణాలకు అవకాశం లేదు. పటేల్‌గూడెంలో వర్షానికి దెబ్బతిన్న శ్మశానవాటిక పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.

రంగాచారి, డీపీవో

సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తానుజనగామలో వైకుంఠధామాల విషయంపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తాం. ఆదర్శ వైకుంఠధామం పనులు, నిధుల విడుదల విషయాలను ఎమ్మెల్యేకు వివరిస్తాను.

జమున, మున్సిపల్ ఛైర్‌పర్సన్

# సింగరేణి ఉద్యోగులకు బకాయిల చెల్లింపు

వరంగల్ : సింగరేణి ఉద్యోగులకు 11వ వేతన ఒప్పందం బకాయిలు(ఏరియర్స్) చెల్లించినట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి డైరెక్టర్(ఫైనాన్స్) బలరాం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. కొంత మంది కార్మికులకు చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. 23 నెలల వేతనంలోని బకాయిలను ఒకే సారి ఇచ్చామని, సగటున ఒక్కో కార్మికుడికి రూ.3.70 లక్షల వరకు వచ్చాయని, అత్యధికంగా రామగుండం ఏరియా హెడ్ ఓవర్‌మెన్ రూ.9.91 లక్షలు పొందారని వెల్లడించారు. కంపెనీ వ్యాప్తంగా మొత్తం రూ.1450 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. 39 వేల మంది కార్మికుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఏరియర్స్ పొందిన ఉద్యోగులు సొమ్మును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. భూపాలపల్లి ఏరియాలోని జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాసరావు ఏరియర్స్ చెల్లింపు చెక్కులను పంపిణీ చేశారు. కేటీకే 5వ గనికి చెందిన కార్మికులు ప్రభాకర్, గణపతిరెడ్డి, రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం వెంకటయ్య, అధికారులు తుకారాం పాల్గొన్నారు.

# పల్లెలు మెరవాలి.. పట్టణాలు మురవాలి

డోర్నకల్ : 2017లో గాంధీ జయంతి రోజున ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛతా హీ సేవ మొదలెట్టారు. ఏటా ఇది అమలవుతోంది. ఈసారి కూడా దీనిని పకడ్బందీగా నిర్వహించాలని సంకల్పించి జిల్లాలో 15వ తేదీన శ్రీకారం చుట్టగా అక్టోబరు 2వ తేదీ వరకు కొనసాగనుంది. గతంలో నిర్వహించిన కార్యాచరణ ద్వారా జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ్ కింద 15 పంచాయతీలు జిల్లా స్థాయి అవార్డులు పొందగా ఒకటి రాష్ట్ర స్థాయి పురస్కారం కైవసం చేసుకుంది. ఇదే స్ఫూర్తితో జిల్లాలో ఇప్పుడు పల్లెలు మెరవాలి..పట్టణాలు మురవాలనే లక్ష్యంతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రజలలో విస్తృతంగా తీసుకెళుతున్నారు. ర్యాలీలు, ప్రతిజ్ఞలతో పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛతా హీ సేవ నిర్వహణలో మధ్యాహ్నం 12 గంటల నాటికి రాష్ట్ర స్థాయిలో జిల్లా 8వ స్థానంలో ఉంది.

పక్కా ప్రణాళికతోనే గుర్తింపు

స్వచ్ఛతా హీ సేవా అమల్లో భాగంగా పల్లెలు, పట్టణాలలో ప్రభుత్వం నిర్దేశించిన రహదారుల శుభ్రం, కాలువల్లో మురుగు నీరు తొలగింపు, నిత్యం చెత్త సేకరణ, కంపోస్టు ఎరువుల తయారీ, ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యం, కూడళ్ల గోడలపై కనువిప్పు కలిగించేలా చైతన్యం రగిల్చారు. అప్పట్లో అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వాములయ్యారు. ఫలితంగా బయ్యారం మండలంలోని కొత్తపేట పంచాయతీ రాష్ట్ర స్థాయిలో పురస్కారం పొందగా జిల్లా స్థాయిలో డోర్నకల్ మండలం-చాప్లాతండా, వెన్నారం, కురవి మండలం-కొత్తూరు(జి), కురవి, నర్సింహులపేట మండలం-రామన్నగూడెం, గూడూరు మండలం-ఏపూరు, కేసముద్రం మండలం-కేసముద్రం స్టేషన్, నెల్లికుదురు మండలం-ఆలేరు, మరిపెడ మండలం-బీచురాజిపల్లి, తండా ధర్మారం, ఎల్లంపేట, పెద్దవంగర మండలం-అవతాపురం, మహబూబాబాద్ మండలం-మల్యాల, తొర్రూరు మండలం-ఖాణాపురం, బయ్యారం మండలం-కొత్తపేట గ్రామ పంచాయతీలు అవార్డులు పొందాయి. అదే ప్రేరణతో ముందుకు సాగాలని జిల్లా యంత్రాంగం కృతనిశ్చయంతో ఉంది.

ప్రత్యేక కార్యాచరణ ఇది

స్వచ్ఛత ప్రాధాన్యంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహణ

పుర/పంచాయతీ పాలకవర్గాలు, అధికార గణం పారిశుద్ధ్య పనుల్లో భాగస్వామ్యం

శ్రమదానం చేయాలి

ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో చైతన్య కలిగించాలి

మొక్కలు నాటి సంరక్షించుకోవాలి

గోడలపై స్వచ్ఛత నినాదాలు రాయాలి

ఇంటింటికి తిరిగి చెత్త సేకరించాలి

కంపోస్టు షెడ్డులో తడి పొడి చెత్త వేరు చేయడం, సేంద్రీయ ఎరువుగా మార్చే చర్యలు అమలు పరచాలి.

గురువారం మధ్యాహ్నం12 గంటల నాటికి ఇలా..

రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థానం: 08

నిర్వహించిన కార్యక్రమాలు: 1226

పాల్గొన్న ప్రజలు: 109958

పని చేసిన గంటలు: 260381

అప్‌లోడ్ చేసిన : 1216

(స్వచ్ఛతా హీసేవ) ఫొటోలు జిల్లాలో..పురపాలికలు : 4 గ్రామ పంచాయతీలు : 461 ప్రజల భాగస్వామ్యం భేష్ రవి, జిల్లా సమన్వయకర్త, స్వచ్ఛ భారత్ గ్రామీణ్ స్వచ్ఛతా హీ సేవలో ప్రజల భాగస్వామ్యం భేష్‌గా ఉంది. ర్యాలీలు, సదస్సులు, ప్రతిజ్ఞలకు ఊహించని స్పందన కనిపించింది. పురపాలి కలు, పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను అమలు చేశాం. ఏ రోజుకారోజు స్వచ్ఛతా హీ సేవపై పర్యవేక్షణ ఉంటుంది. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో ముందుకు వస్తుండటం ఒక శుభ పరిణామం. గతంలో వచ్చిన అవార్డులే స్ఫూర్తిగా ముందుకు సాగుతాం

# అన్నదాతలకు ఊరట..!

ములుగు : జిల్లాలో జులైలో ముంచెత్తిన వర్షాలు ఆ తర్వాత పూర్తిగా వెనుకంజ వేశాయి. సాధారణ వర్షపాతం కంటె తక్కువగా నమోదైంది. దీంతో అన్నదాతలు వర్షాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి తక్కువగా ఉన్నాయి. జులై మినహాయిస్తే జూన్, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలు నిరాశ కలిగించాయి. ఈ నాలుగు నెలల్లో గతేడాది 58 శాతం వర్షంపాతం నమోదుకాగా, ఈ ఏడాది కేవలం 8 శాతం మాత్రమే నమోదైంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు కొంత ఊరటనిస్తున్నాయి. నీటి వసతి ఉన్న రైతులు పంటలకు బోర్లు, బావుల ద్వారా నీరందిస్తున్నారు. వర్షాధారంతో వేసిన పత్తి, మిరప పంటలకు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయి. జిల్లాలో రెండు నెలల్లో అతివృష్టి, అనావృష్టి నెలకొంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఆశించిన మేర వర్షపాతం నమోదు కాకపోవడవంతో కర్షకులు బోర్లు, బావులకు అమర్చిన విద్యుత్తు మోటార్లకు పదును పెడుతున్నారు. జులైలో ఊహించని రీతిలో వర్షాలు ముంచెత్తడంతో



కుంటలు, చెరువులు పూర్తిగా నిండి జలకళను సంతరించుకున్నాయి. ప్రస్తుతం ఆ నీరే వరి పంటకు ఆధారమైంది.

1.40 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్‌లో 187.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 176.2మి.మీ సాధారణంతో ఇంచుమించు సమానంగా ఉంది. గతేడాది సెప్టెంబర్‌లో 380.5 మి.మీ నమోదైంది. సగానికి సగం తేడా ఉండటంతో.. రైతులు కొంతమేర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. 1.10 లక్షల ఎకరాల్లో వరి, 994 ఎకరాల్లో మొక్కజొన్న, 28,980 ఎకరాల్లో పత్తి సాగవుతోంది.

భూముల్లో తేమ తగ్గదు

గౌస్ హైదర్, జిల్లా వ్యవసాయాధికారి

ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వర్షాలు కొంత తక్కువగా కురిసినా.. పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేవు. జిల్లాలో ఎక్కువగా సుమారు 80 శాతం వరి పంట సాగవుతుంది. పత్తి వేసిన భూముల్లో ఇప్పుడే తేమ తగ్గదు. నీటి వసతి ఉన్న రైతులు 30, 60, 90 రోజుల వ్యవధిలో పత్తి పంటలకు ఎకరాకు 40 కేజీల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలి. ములుగు, వెంకటాపూర్ మండలాల్లో మాత్రమే ఎక్కువగా పత్తి వేశారు. మిగిలిన మండలాల్లో వరి సాగవుతుండగా ఎక్కువగా చెరువులు, కుంటల పరిధిలోనే ఉంది. జిల్లాలో యూరియా కొరత లేదు. నిర్దేశించిన మోతాదు కంటే ఎక్కువ నిల్వలు జిల్లాలో ఉన్నాయి.

# పౌర సేవ.. నిర్లక్ష్యపు తోవ!

భూపాలపల్లి : జిల్లాలోని ఏకైక పురపాలక సంఘం భూపాలపల్లి పరిధిలో నెలకొన్న సమస్యలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు 'సిటిజన్ యాప్' పోర్టల్‌ను రూపొందించగా అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. 2019 కొత్త మున్సిపాలిటీ చట్టం ప్రకారం పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణ ప్రజలకు వివిధమైన సమస్యలు ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారనే సమాచారం(పౌర సేవా పత్రం) నోటీసు బోర్డుపై ఏర్పాటు చేశారు. లక్ష్యం బాగానే ఉన్నా.. చిత్తశుద్ధి కొరవడటంతో తగిన ముందడుగు పడటం లేదు. పౌర సేవలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలేదు. ఈ సేవలపై పుర అధికారులు మొక్కుబడిగానే స్పందిస్తున్నారనే విమర్శలు సర్వత్రా నెలకొన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ సమస్యలు ఏమైనా ఉంటే వాటిని ఆధారాలతో సహ ఫొటో తీసి, ఈ యాప్‌లో నమోదు చేయాలి.. పౌర సేవా పత్రంలో పేర్కొన్న సమస్యలపైనా ఫిర్యాదు చేసుకోవచ్చు. పుర సిబ్బంది సమస్యలను ఆన్‌లైన్‌లో మొదటగా గుర్తించి, ఆ తర్వాత క్షేత్ర స్థాయిలో పరిష్కారం చేస్తారు. పారిశుద్ధ్య సంబంధిత ఫిర్యాదు అయితే రెండు గంటల్లో, సాంకేతికతకు సంబంధించిందైతే రెండు వారాల్లో పరిష్కరించాలి. ఇది పౌర సేవల లక్ష్యం. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలో పారదర్శ



కంగా సేవలందించే లక్ష్యంతో ఉన్నతాధికారులు ప్రత్యేకంగా యాప్ రూపొందించారు. వేగంగా సేవలందించేలా ప్రణాళికలను రూపొందించి గతేడాదిన్నర క్రితం ప్రారంభించారు. ప్రతి రోజు ఈ యాప్ ద్వారా వచ్చే సమస్యలకు కమిషనర్ ప్రాధాన్యం ఇచ్చేలా పుర ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

ప్రజలకు అవగాహన శూన్యం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్యం ఘనంగా ఉన్నా, ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమైయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొదట యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఫోన్ నంబర్, ఇతర వివరాలు, సమస్య ఫొటోను తప్పనిసరిగా నమోదు చేయాలి. దీనిలో ఆస్తి పన్ను చెల్లింపు, పౌర సేవలు, ఫిర్యాదులు, సంబంధిత వార్డుల వారీగా అధికారులు, సిబ్బంది జాబితా, ప్రకటనలు, సలహాలు, సూచనలు.. తదితర విషయాలను ఈ యాప్‌లో పొందుపర్చారు. ప్రజలకు అవగాహన కల్పించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చొరవ చూపడం లేదనే విమర్శలు నెలకొన్నాయి. రెండే రెండు అంశాలపై ప్రజల నుంచి స్పందన వస్తోంది. పారిశుద్ధ్యం ఒకటి కాగా, రెండోది ఇంజినీరింగ్ అంశాలు. ఇప్పటికైనా ఈ యాప్ గురించి అవగాహన కల్పించి, లక్ష్యం దిశగా చర్యలు తీసుకోవాలి. పౌర సేవాపత్రంలో పేర్కొన్న 20 రకాల సమస్యలు కూడా గడువు లోపు పరిష్కారానికి నోచుకోవటం లేదు.

మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యమే..

మున్సిపాలిటీ 2019 కొత్త చట్టం ప్రకారం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ పూర్తి పారదర్శకంగా ఇవ్వడానికి ఆసుపత్రి లాగిన్ నుంచే దరఖాస్తులు స్వీకరించి, ఒకటే రోజున ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారు. ఆసుపత్రి నుంచి తీసుకోని వ్యక్తులు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే.. ఏడు రోజుల్లో మున్సిపాలిటీ నుంచి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి. అయితే దరఖాస్తుల్లో వివరాలు సక్రమంగా లేకపోవడం, ఇద్దరు గజిటెడ్ ఉద్యోగుల సంతకాలతో కూడిన అంగీకారపత్రం జత చేయకపోవడంతో ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యమవుతోంది. బాధితులు రోజుల తరబడి మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దరఖాస్తుల్లో వివరాలు సక్రమంగా లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యమవుతోందని మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు.సమస్యల పరిష్కారం దిశగా..- అవినాష్, ఇన్‌ఛార్జి కమిషనర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ప్రజల సమస్యలను గుర్తిస్తున్నాం. వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల నుంచి ఆధారాలతో సహా నమోదు చేసే వాటికి తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

# ఎక్కడి పనులు అక్కడే!

కన్నాయిగూడెం : ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చాలనే సంకల్పంతో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గుత్తేదారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత ఏడాది మార్చిలో ప్రారంభించిన పనులు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. కన్నాయిగూడెం మండలం గూర్రేవుల, ముప్పనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో టెండరు విధానం ద్వారా పనులను గుత్తేదారులకు అధికారులు అప్పగించారు. ఈ పనులను గుత్తేదారు సబ్ కాంట్రాక్ట్ కింద ఇతరులకు అప్పగించారు. దీంతో జాప్యం నెలకొంది. ఉ



పాధ్యాయులు విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టి పాఠాలను బోధిస్తున్నారు. కిచెన్ షెడ్ నిర్మాణం పిల్లర్ల వేసి వదిలేయడంతో వరండాలో కూర్చొని భోజనం చేస్తున్నారు. ముప్పనపల్లి పాఠశాల ఆవరణలో సంపను పూర్తి చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. వాష్‌హౌస్ నల్లాలను అమర్చక నిరుపయోగంగా మారింది. మరుగుదొడ్ల ఫ్లోర్ వేసి వదిలేశారు.

ఒకే గుత్తేదారు అనేక పనులు!ముప్పనపల్లిలో కేజీబీవీ పనులు చేపట్టిన గుత్తేదారు అదే ఆవరణలో జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొన్ని పనులు సబ్‌కాంట్రాక్ట్ తీసుకుని చేస్తున్నారు. ఆయనే గూర్రేవుల జడ్పీ ఉన్నత పాఠశాల పనులు కూడా చేస్తున్నారు. దీంతో ఏ పని పూర్తి కాలేదు. పెయింటింగ్ టెండర్ పొందిన వారు ఇంకా పనులు మొదలుపెట్టలేదు. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఇబ్బందులను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఫ్లూ పంజా!



వరంగల్ : తగ్గని జ్వరం, దగ్గు.. తోడుగా ఇతర శ్వాస సమస్యలతో ఎంజీఎం ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. కొవిడ్ వైరస్‌తో సుదీర్ఘ పోరాటం చేసిన ప్రజలు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటుండగా, అవే లక్షణాలతో వస్తున్న జబ్బులు ప్రజలను భయాందోళన కలిగిస్తున్నాయి.. నయం కావడానికి సాధారణం కంటే ఎక్కువ రోజులు పడుతుండటంతో ఇది ఇన్‌ఫ్లుయెంజా హెచ్3ఎన్2 వైరస్ కారణమై ఉంటుందని వైద్యులు అంటున్నారు. దేశవ్యాప్తంగా ఇన్‌ఫ్లూయెంజా పంజా విసురుతుండగా కేంద్ర ప్రభుత్వం ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన నేపథ్యంలో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి ఈ రకమైన వ్యాధిలక్షణాలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీన 43 మంది ఆసుపత్రిలో చేరగా, 8న 46 మంది.. 9న 45 మంది చేరారు.

లక్షణాలివేచలికాలం నుంచి వేసవికి మారుతున్న కాలంలో వచ్చే వాతావరణ మార్పులతో జ్వరంతోపాటు దగ్గు, వికారం, వాంతులు, గొంతు నొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు, కొన్ని సందర్భాలలో అతిసారం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. వీరిలో ఇన్ఫెక్షన్ ఐదు నుంచి వారం రోజుల పాటు ఉంటుంది. జ్వరం మూడు రోజుల్లో తగ్గుతుండగా, దగ్గు మూడు వారాల వరకు ఉంటున్నట్లు రోగులు చెబుతున్నారు.

గొంతునొప్పి, దగ్గుతో ఆసుపత్రిలో చేరా

-లచ్చమ్మ, కేశవపూర్, ఎల్కతుర్తి మండలం

మాది ఎల్కతుర్తి మండలం కేశవపూర్. వారం రోజులుగా దగ్గు, గొంతునొప్పితో బాధపడుతున్నా..అక్కడ డాక్టర్‌కు చూపించి మందులు వాడితే తగ్గకపోవడంతో ఎంజీఎంకు వచ్చా. ఇక్కడ డాక్టర్లు ఆసుపత్రిలో చేర్చుకున్నారు. డాక్టర్లు మంచిగా చూస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

-డాక్టర్ సనత్‌కుమార్, జనరల్ ఫిజీషియన్,

కొవిడ్ సమయంలో పాటించిన విధంగా మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం వంటివి చేసుకోవాలి. ముక్కు, నోరుకు దగ్గరగా చేతులు తీసుకెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకోవాలి. యాంటిబయాటిక్స్ ఎక్కువ మోతాదు తీసుకోరాదు. గుంపులుగా ఉన్న దగ్గర ఎక్కువ సమయం ఉండరాదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శ్వాస కోశ సమస్యతో బాధపడుతుంటే, సాధారణ వైద్యంతో తగ్గనప్పుడు నిపుణులైన వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.ఫ్లూ అని తేలితే ప్రత్యేక వార్డు, చికిత్స అందిస్తాం-డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్, ఎంజీఎం ఆసుపత్రి వరంగల్

జ్వరం కేసులు పెరుగుతున్నది నిజమే.. రెండు రోజుల్లో 35 కేసులు ఫ్లూ లక్షణాలున్న రోగులు చేరారు. అందులో పెద్దవారికంటే, పిల్లలు ఎక్కువగా ఉన్నారు. జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్నవారు అధికంగా ఉన్నారు. కొవిడ్, స్వైన్‌ఫ్లూ, ఫ్లూ జ్వరాల్లో ఇవే లక్షణాలుంటాయి. నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నాం. రాపిడ్ పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటి వరకు కరోనా అని తేలలేదు. అది స్వైన్‌ఫ్లూ లక్షణాలా అని నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఇందుకు సంబంధించిన నివేదికలు రెండురోజుల్లో వస్తాయి. ఫ్లూ అని తేలితే ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తాం. ప్రజలు భయపడకుండా జాగ్రత్తలు పాటించాలి.

# 'ధ్రువీకరణ'లో దందా!




వరంగల్ : 'హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో 31వేల పుట్టిన(బర్త్), మరణ తేదీ(డెత్) నకిలీ ధ్రువీకరణ పత్రాలు బయటపడ్డాయి. 2000 సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా ఈ సర్టిఫికెట్ల జారీ విధానం పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నా నకిలీ సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారు? ఎలా సాధ్యమైందనేది చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి నకిలీ పత్రాలు వరంగల్ జీడబ్ల్యూఎంసీలోనూ జారీ అయ్యాయి. గ్రేటర్ వరంగల్ జనన, మరణాల నమోదు విభాగంలో దళారుల దందా ఎక్కువగా ఉంది. పుట్టిన, మరణ తేదీ ధ్రువీకరణ పత్రాల జారీ పైరవీకారుల ద్వారానే జరుగుతున్నాయి. మీ-సేవ కేంద్రాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. బల్దియా ఉద్యోగుల సహకారం తోడవుతోంది.

హైదరాబాద్‌లో వేల సంఖ్యలో నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు బయటపడటంపై రాష్ట్ర పురపాలక శాఖ, జీహెచ్‌ఎంసీ విచారణకు ఆదేశించింది. మీ-సేవ కేంద్రాలు, పైరవీకారులు, జనన మరణాల నమోదు విభాగంలో పనిచేసే ఉద్యోగులు ఒక్కటై బోగస్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి ఉంటారని ప్రాథమికంగా గుర్తించారు. వరంగల్ మహానగరంలోనూ పైరవీకారులు, ఉద్యోగులు ఒక్కటై వీటిని జారీ చేస్తున్నారని కొన్ని ఘటనల్లో వెలుగు చూసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మీ-సేవ కేంద్రాల్లో ప్రైవేటు వ్యక్తులు అడ్డా వేసి దరఖాస్తుదారులను మచ్చిక చేసుకుంటున్నారు.

ఇదీ వసూళ్ల తీరు

జనన ధ్రువీకరణ పత్రం వెంటనే కావాలంటే రూ.2-3 వేలు. ఒకటి, రెండు రోజుల వరకు ఆగితే రూ.1000-1500.

ఆర్డీవో ప్రాసెస్ ద్వారా ధ్రువీకరణ పత్రం కావాలంటే రూ.5-6 వేలు. అత్యవసరమైతే అదనపు ధర చెల్లించాలి.

మరణ ధ్రువీకరణ పత్రం వెంటనే కావాలంటే రూ.1000-1500. ఒకటి, రెండు రోజులు ఆగితే రూ.1000.

నిబంధనలు ఇలా

బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం దేశంలోని ఏ మీ-సేవ కేంద్రం నుంచైనా దరఖాస్తు చేయొచ్చు. అప్లికేషన్ ప్రాసెస్, సర్టిఫికెటు డౌన్‌లోడ్ వరకు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జారీ అవుతాయి. మాన్యువల్ విధానం లేదు.

పుట్టిన తేదీ నమోదు చేసేందుకు గ్రేటర్ వరంగల్ నగరంలోని 145 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వ్యక్తిగత లాగిన్లు ఇచ్చారు. బాబు, బేబి పుట్టిన వారం రోజుల్లో ఆన్‌లైన్‌లో బర్త్ రిజిస్ట్రేషన్ చేస్తారు. తల్లిదండ్రుల పేర్లు, చిరునామా, పుట్టిన తేదీ ఇతర వివరాలు నమోదు చేస్తారు. పిల్లల పేర్లు మాత్రం సర్టిఫికెట్ తీసుకునే సమయంలో మీ-సేవ కేంద్రాల్లో నమోదు చేయాలి. 18 ఏళ్లలోపు సర్టిఫికెట్లు పొందాలి. ఒకవేళ బర్త్ రిజిస్ట్రేషన్లు లేని వారు పత్రాలు కావాలంటే ఆర్డీవో ద్వారా తెచ్చుకోవాలి.

మరణ తేదీ రిజిస్ట్రేషన్లు నమోదు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు లాగిన్లు ఇచ్చారు. ఆసుపత్రిల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి వివరాలు వారం రోజుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మరణించిన వారి పేరు, చిరునామా, ఊరు, మండలం, జిల్లా పేరు ఉంటాయి. డెత్ సర్టిఫికెటు కోసం మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి.

సహజ మరణం(ఇళ్లలో చనిపోతే) వరంగల్ కాశీబుగ్గ, కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల్లో ఫారం-2 ద్వారా సమాచారం ఇవ్వాలి. మృతిచెందిన వారి ఆధార్ కార్డు, ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు ష్యూరిటీగా ఇవ్వాలి. బల్దియాకు చెందిన హెల్త్ అసిస్టెంటు ఇంటి వద్దకు వచ్చి మరణ సమాచారం సేకరించి డెత్ రిజిస్ట్రేషన్ చేస్తారు. దీని ఆధారంగా మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి మరణ ధ్రువీకరణ పత్రం పొందవచ్చును.

ఉదాహరణలివిగో..

హనుమకొండ పోచమ్మకుంటలో ఓ మహిళ చనిపోక ముందే చనిపోయినట్లుగా కుటుంబ సభ్యులు మీ-సేవ కేంద్రంలో నకిలీ సర్టిఫికెటు పొందారు. ఆస్తి కోసం ఇలా చేశారని పోలీసుల విచారణలో తేలింది. బోగస్ పత్రం ఎలా జారీ చేశారో ఇప్పటి వరకు మిస్టరీగానే ఉంది.

- హనుమకొండ యాదవనగర్‌లో ఓ మహిళ బతికుండగానే డెత్ సర్టిఫికెటు పొందారు. సదరు మహిళ బతికే ఉన్నట్లుగా తెలియడంతో గ్రేటర్ వరంగల్ సర్టిఫికెటు రద్దు చేసింది.

- 2012-13లో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో రెండు నకిలీ పుట్టిన తేదీ పత్రాలు బయటపడ్డాయి. ప్రైవేటు వ్యక్తులపై కేసులు కూడా నమోదయ్యాయి.

పౌర సేవల పట్టిక ఏమి చెబుతోంది..

పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం దరఖాస్తు చేసిన 7 రోజుల్లో జారీ చేయాలి. బర్త్ రిజిస్ట్రేషన్ ఉండాలి.

మరణ ధ్రువీకరణ పత్రం దరఖాస్తు చేసిన 7 రోజుల్లో జారీ చేయాలి. డెత్ రిజిస్ట్రేషన్ ఉండాలి

సహజ మరణ నివేదిక సమాచారం వారం రోజుల్లో పూర్తవ్వాలి.

జనన మరణ సమాచారం లేని వివరాలు దరఖాస్తు చేసిన 3 రోజుల్లో ఇవ్వాలి.

అప్రమత్తంగా ఉన్నాం-వేణుగోపాల్, ఉప గణాంక అధికారి

గ్రేటర్ వరంగల్‌లో ఇప్పటి వరకు నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యే అవకాశాలు తక్కువే. మీ-సేవ కేంద్రాల్లో జారీ అయ్యే అవకాశాలుంటాయి. హైదరాబాద్ మహా నగర పాలక సంస్థలో బోగస్ ధ్రువీకరణ పత్రాలు వెలుగు చూడటంతో ఇక్కడ అప్రతమయ్యాం. పైరవీలు నా దృష్టికి రాలేదు.

# యువతకు భళా.. ఉపాధి మేళా

నల్గొండ : నవభారత్.. సరికొత్త అవసరాలు.. ఆధునిక వృద్ధి.. నినాదాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాకు శ్రీకారం చుట్టింది. ఐటీఐ విద్యార్థులకు ఇది ఓ వరంలా మారుతోంది. ఐటీఐ విద్యార్థులు తమ కోర్సు పూర్తికాగానే నచ్చిన కంపెనీలో అప్రెంటిస్‌షిప్‌లో చేరేందుకు అవకాశం లభిస్తుంది. ప్రతి నెల ఈ మేళాలు ఏర్పాటు చేయాలని కేంద్రం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దక్కేలా చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఏర్పాటు చేసింది. జీవితంతో త్వరితగతిన స్థిరపడాలనే ఉద్దేశంతో ఈ కోర్సును ఎక్కువ మంది విద్యార్థులు ఎంచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు 24 ఉన్నాయి. వీటిలో సుమారు 10 వేల మంది విద్యనభసిస్తున్నారు. ప్రతి సంవత్సరం కోర్సు పూర్తి చేసుకునే వారు సుమారు 2,500 మందికి పైగా ఉంటారు. వీరు అప్రెంటిస్‌షిప్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వారి పిలుపు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. పరిశ్రమలకు వెళ్లి దరఖాస్తులు సమర్పించినా.. ఒక్కోసారి ఫలితం ఉండటం లేదు. ఇదే సమయంలో కొన్ని పరిశ్రమలకు సరైన అభ్యర్థులు దొరకని పరిస్థితీ ఉంటోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు, పరిశ్రమల ప్రతినిధులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చేందుకు రూపొందించిన విధానమే



ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా.

ఇలా చేస్తారు..ప్రధానమంతి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా అధికారుల ఆదేశాల మేరకు..పారిశ్రామిక విద్యను అందిస్తున్న ఐటీఐ కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల ప్రతినిధులను ఆహ్వానిస్తాయి. ఆయా ప్రతినిధులు తమ పరిశ్రమల్లో అవకాశం ఉన్నమేరకు విద్యార్థులను ఎంపిక చేసుకుని అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇస్తారు. వీలుంటే వారి పరిశ్రమల్లో ఉపాధి కల్పించే అవకాశమూ ఉంటుంది. ఆరు నెలల క్రితం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇటీవల ఆర్టీసీ సంస్థ ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఎంపిక చేసి అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇస్తుంది.

చక్కటి అవకాశం- గోపాల్‌నాయక్ ఐటీఐ జిలా కన్వీనర్

ఇది నూతన విధానం. ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా కార్యక్రమం ఆరు నెలల క్రితం ప్రారంభమైంది. వారి ఆదేశాల మేరకు మేళాలు నిర్వహిస్తాం. ఐటీఐ పూర్తి చేసిన వారు అప్రెంటిస్‌షిప్ కోసం గతంలో పరిశ్రమల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. మేళాకు పరిశ్రమల ప్రతినిధులే హాజరవుతూ అభ్యర్థుల ప్రతిభ అధారంగా అవకాశాలు కల్పిస్తారు.

# రూసా.. పైసా విదిల్చలే!

"తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సైన్స్ కళాశాల భవనం పనులు నత్తనడకన నడుస్తున్నాయి. 2021 డిసెంబరులో వీసీ ఆచార్య రవీందర్ భూమిపూజ చేయగా.. నాటి నుంచి నిర్మాణం ఆగుతూ సాగుతోంది. నిధుల సర్దుబాటుకు వర్సిటీ అధికారులు తంటాలు పడుతున్నారు."

యూనివర్సిటీకి 2015లో న్యాక్ 'బీ' గ్రేడు వచ్చింది. ఈ గుర్తింపు కలిగిన విద్యాసంస్థలకు రూసా(రాష్ట్రీయ ఉచ్ఛతర అభియాన్) నిధులు మంజూరు చేస్తుంది. ఇందులో భాగంగా మూడేళ్ల కిందట రూ.20 కోట్లు కేటాయించారు. వీటిలో రూ.10 కోట్లతో వర్సిటీలో మౌలిక వసతులు, మిగతా రూ.10 కోట్లు సైన్స్ భవనానికి వెచ్చించాలని నిర్ణయించారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇప్పటికీ రూసా నుంచి నయా పైసా విడుదల కాకపోవడం విడ్డూరం.

ముంచుకొస్తున్న గడువు

సైన్స్ కళాశాల భవనం 15 నెలల్లో పూర్తి చేయాలని గడువు ఉంది. అది ఈ నెలాఖరుతో ముగుస్తున్నా.. ఇప్పటి వరకు 65-70 శాతం మేర పనులే అయ్యాయని సంబంధిత అధికారులే చెబుతున్నారు. ఇదివరకు పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించామంటున్నా.. ఇంకా రూ.4 కోట్లకు పైగా బిల్లులు రావల్సి ఉందని గుత్తేదారు అంటున్నారు. ఈ భవనం మరో మూడు నెలల్లో అందుబాటులోకి వస్తుందని వీసీ



ఇటీవల ఓ కార్యక్రమంలో ప్రకటించారు.

అందుబాటులోకి తీసుకురావాలి

ఉన్నత విద్యాశాఖ, తెవివి ఉన్నతాధికారుల సమన్వయలోపంతో నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సకాలంలో పనులు పూర్తి చేసి ఈ సైన్స్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరానికి ముందే అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

బిల్లులు రావాల్సి ఉంది

సైన్స్ కళాశాల భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ప్రభుత్వానికి పంపాం. రూసా నిధుల ఆలస్యం కారణంగా పనులకు ఆటంకం ఏర్పడొద్దని యూనివర్సిటీ అంతర్గత నిధుల నుంచి అదనంగా రూ.కోటి చెల్లించాం. రూసా నుంచి వచ్చాక తిరిగి తీసుకుంటాం. మూడు నెలల్లో భవనం అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. - ఆచార్య రవీందర్, తెవివి వీసీ

అంతర్గత మళ్లింపు!

సైన్స్ కళాశాల భవన నిర్మాణ వ్యయం రూ.12 కోట్లు. ఇందులో రూసా నిధులు రూ.10 కోట్లు, మిగతా రూ. 2 కోట్లు వర్సిటీవి. యూనివర్సిటీ వాటా నిధులను గుత్తేదారుడికి చెల్లించినట్లు ఇంజినీరింగ్ విభాగం అధికారి చెప్పారు. రూసా నిధులు రాకనే సమస్య నెలకొంది. ఇదివరకే అప్పులు చేసి పనులు చేస్తున్నానని, బిల్లులు చెల్లించేలా చూడాలని యూనివర్సిటీ అధికారులు, మంత్రి, ఎమ్మెల్యేతో గుత్తేదారు మొరపెట్టుకున్నారు. ఈ పనులకు సంబంధించిన రూ.3.11 కోట్ల బిల్లులు గత నెలలో పంపినప్పటికీ నిధుల జాడలేక.. తెవివి అంతర్గతంగా రూ.కోటి మళ్లించామంటున్నారు.



# సీల్డ్ కవర్‌లో.. చంద్రబాబు కస్టడీ విచారణ నివేదిక

విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. దీనిపై సీఐడీ తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. కౌంటర్‌లో సవరణలు చేసి మళ్లీ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరోవైపు చంద్రబాబు కస్టడీ విచారణ నివేదికను కోర్టుకు సీఐడీ సమర్పించింది. సీల్డ్ కవర్‌లో దాన్ని అందజేసింది. దీంతో పాటు చంద్రబాబును ఐదు రోజుల కస్టడీకి కావాలని కోరుతూ సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది.

# విదేశీ విద్యా దీవెన కింద 1,830 మందికి సాయం

అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తున్న 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకం కింద ఇప్పటివరకు 1,830 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం లభించింది. గత ప్రభుత్వం అమలు చేసిన విదేశీ విద్య పథకం అక్రమాల పుట్టగా మారిందని విజిలెన్స్ విచారణలో వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పథకంలోని లోపాలను చక్కదిద్ది మరింత ఎక్కువ మందికి, మరింత ఎక్కువ ఆర్థిక సాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీనికింద రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులందరికీ సంతృప్త విధానంలో విదేశీ విద్యకు ప్రభుత్వం సాయమందిస్తోంది. 21 నిర్దేశిత సబ్జెక్ట్ కేటగిరీల్లో 50 విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో ప్రవేశం పొందినవారికి ట్యూషన్ ఫీజు కింద రూ.కోటి 25 లక్షల వరకు ఆర్థిక సాయం (వాస్తవ రుసుం) అందిస్తోంది. ఈబీసీలు రూ.కోటి వరకు ఆర్థిక సాయానికి అర్హులు. గత టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు మాత్రమే సాయం అందించేది.




అంతేకాకుండా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేవారి కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ.6 లక్షలకే పరిమితం చేసింది. ఆ ఆదాయ పరిమితిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.8 లక్షలకు పెంచింది. దీంతో ఎక్కువ మంది విద్యార్థులకు మేలు జరుగుతోంది.

# రైతు సంక్షేమ ప్రభుత్వం ఇది : అసెంబ్లీలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



అమరావతి: ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల్ని మోసం చేసిందని విమర్శించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వైయస్ జగన్ సిద్ధాంతమన్నారు. ఆ దిశగా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని, రైతు భరోసా పేరుతో అన్నదాతలను వ్యవసాయంలో ప్రోత్సహిస్తున్నారని, కోవిడ్ సంక్షోభంలోనూ మా ప్రభుత్వం రైతులను ఆదుకుందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.



# డబ్బులు లేనప్పుడు మహాయజ్ఞాలెందుకు?

## ప్రభుత్వం నిర్వహించిన మహా యజ్ఞానికి.. గుత్తేదారులకు అందని బిల్లులు!

ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో 4 నెలల కిందట చేపట్టిన శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి అవసరమైన సరకులు సరఫరా చేసిన గుత్తేదార్లకు డబ్బులు ఇప్పటికీ చెల్లించలేదు. ఓ గుత్తేదారుకు రూ.3 లక్షలు ఇవ్వడానికి ముప్పుతిప్పలు పెడుతున్నారు. డబ్బులు లేనప్పుడు మహాయజ్ఞాలు ఎందుకని గుత్తేదారులు.. అధికారులను నిలదీస్తున్నారు. పూలు, పాలు, సరకులు, తోరణాల బిల్లులూ ఇంతవరకూ ఇవ్వలేదంటూ అధికారులపై గుత్తేదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రధాని మోదీ సభకు వెళ్తూ..

## ప్రధాని మోదీ పాల్గొనే సభకు వెళ్తున్న బీజేపీ కార్యకర్తల బస్సుకు ఘోర ప్రమాదం.. 39 మందికి గాయాలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఖర్గోల్ జిల్లాలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభకు హాజరుకావడానికి బీజేపీ కార్యకర్తలతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. బీజేపీ కార్యర్తలతో వెళ్తున్న బస్సు ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 39 మంది బీజేపీ కార్యర్తలు గాయపడ్డారు. వారంతా సోమవారం భోపాల్‌లో జరిగే 'కార్యకర్త మహాకుంభ్'సభలో పాల్గొనడానికి వెళ్తున్నారు. ఈ సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సభలో పాల్గొనడానికి వెళ్తున్న బస్సు కస్రవాడ సమీపంలో అర్ధరాత్రి ప్రమాదానికి గురైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సులో ఎక్కువగా ఖపర్జమ్లీ, రూప్‌గఢ్, భగవాన్‌పురా, రాయ్ సాగర్‌కు చెందిన బీజేపీ కార్యకర్తలు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగిన బీజేపీ 'జన్ ఆశీర్వాద యాత్ర' అధికారిక ముగింపు, జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఈ 'కార్యకర్త మహాకుంభ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ 'మహాకుంభ్' కార్యక్రమాన్ని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ కార్యక్రమానికి 10 లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా తమ పార్టీ బలంపై ఓ అంచనాకు రావొచ్చని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. కాగా అధికార పార్టీ కాంగ్రెస్‌తో గట్టి పోటీని ఎదుర్కొంటున్న మధ్యప్రదేశ్‌లో గత 45 రోజులలో ప్రధాని మోదీ పర్యటించడం ఇది మూడోసారి కావడం గమనార్హం.



# మహిళను వివస్త్రను చేసి.. నోట్లో మూత్రం పోయించి..

పట్నా: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించినా అదనపు వడ్డీ ఇవ్వలేదని దళిత మహిళపై ఓ వ్యక్తి అత్యంత అమానవీయంగా ప్రవర్తించాడు. ఆమెను వివస్త్రను చేసి దాడి చేశాడు. ఆమె నోట్లో మూత్రం పోయించాడు. ఈ అమానుష ఘటన బిహార్ రాజధాని పట్నాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్నా జిల్లా మోసిమ్‌పుర్ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త.. స్థానికంగా పలుకుబడి ఉన్న ప్రమోద్ సింగ్ వద్ద కొన్ని నెలల కితం రూ.1500 అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బును వడ్డీతో సహా తిరిగి చెల్లించినా.. అదనపు వడ్డీ ఇవ్వాల్సిందేనని ప్రమోద్ సింగ్ డిమాండ్ చేశాడు. అందుకు వారు అంగీకరించలేదు. దీంతో ఆ దంపతులపై కోపం పెంచుకున్న ప్రమోద్.. గతవారం సదరు మహిళకు ఫోన్ చేసి బెదిరించాడు. అదనపు వడ్డీ ఇవ్వకపోతే గ్రామంలో నగ్నంగా ఊరేగిస్తానని బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రమోద్ గత శనివారం రాత్రి అతడి అనుచరులతో కలిసి మహిళ ఇంటికి వెళ్లాడు. ఆమెను బలవంతంగా తన ఇంటికి తీసుకెళ్లి ఆమెపై దాడి చేశాడు. మహిళను వివస్త్రను చేసి కర్రలతో కొట్టించాడు. అక్కడితో ఆగకుండా తన కుమారుడితో మహిళ నోట్లో మూత్రం పోయించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధిత మహిళ మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రధాన నిందితులైన ప్రమోద్ సింగ్, అతడి కుమారుడు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. బాధిత మహిళ ప్రస్తుతం గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు వెల్లడించారు.



# భారత్‌పై ఆరోపణలు రుజువైతే..!

టొరంటో: ఖలిస్థానీ అంశంతో భారత్, కెనడా మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వివాదంపై కెనడా రక్షణ మంత్రి బిల్ బ్లెయిర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో బంధం తమకు 'ముఖ్యమైనదే' అని పేర్కొన్న ఆయన.. నిజ్జర్ హత్య కేసులో దర్యాప్తు తప్పకుండా కొనసాగుతుందని తెలిపారు. "నిజ్జర్ హత్య కేసులో భారత్‌పై ఉన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగిస్తాం. అదే సమయంలో దిల్లీతో మా భాగస్వామ్య బంధం కూడా కొనసాగుతుంది. భారత్‌తో బంధం మాకు 'ముఖ్యమే'. అయితే, ఈ ఆరోపణలు నిజమని రుజువైతే.. ఇది సవాల్‌తో కూడుకున్న సమస్యగా మారుతుందని మాకు తెలుసు. కానీ, మా చట్టాలను గౌరవించడం, మా పౌరులను రక్షించుకోవడం మా బాధ్యత.

అందుకోసం.. ఈ కేసులో క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి అసలు నిజాన్ని వెలికితీయాల్సిన బాధ్యత మాపై ఉంది. ఈ ఆరోపణలు నిజమైతే.. అది చాలా ఆందోళన కర అంశంగా మారుతుంది. మా గడ్డపై మా పౌరుడిని (నిజ్జర్‌ను ఉద్దేశిస్తూ) హత్య చేయడం మా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమే" అని ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెనడా మంత్రి బ్లెయిర్ వ్యాఖ్యానించారు.

**ట్రూడోకు జైశంకర్ కౌంటర్..** మరోవైపు నిజ్జర్ హత్యపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలకు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మరోసారి గట్టిగా బదులిచ్చారు. ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్న ఆయన భారత్, కెనడా మధ్య ఉద్రిక్తతలను గురించి ప్రస్తావిస్తూ.. ట్రూడోపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "స్వేచ్ఛ పేరుతో ఎలాగైతే చాలా పనులు జరుగుతున్నాయో.. మార్కెట్ పేరుతోనూ చాలా జరుగుతాయి" అని జైశంకర్ అన్నారు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉండొచ్చంటూ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఈ దుమారం మొదలైన విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య పరస్పర విమర్శలు, దౌత్యవేత్తల బహిష్కరణలు జరిగాయి. కాగా.. కెనడా ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ రాజకీయ ప్రేరేపితమేనని కొట్టిపారేసింది.

# బాబు అరెస్ట్ బీజేపీకి తెలియకుండా జరగదు

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గురించి, ప్రజల సమస్యల గురించి ఆలోచించడం మానేసిందని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 15 రోజులుగా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుని వేధించడం తప్ప ఇంకేమీ లేవన్నారు. కక్షపూరిత రాజకీయాలు పక్కన పెట్టి రైతులు, ప్రజల గురించి ఆలోచించాలని హితవుపలికారు. శాంతి భద్రతల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. పోలీస్ యంత్రాంగం యావత్తు అధికార పార్టీ సేవలో ఉందని మండిపడ్డారు.

సాక్షాత్తు తిరుమల కొండపై బస్సు కూడా దొంగతనం చేశారన్నారు. రాయలసీమ ప్రాంతం గురించి ఒక్క ప్రజా ప్రతినిధి కూడా



మాట్లాడటం లేదన్నారు. "మా రాజధాని మాకు కావాలి... రాయలసీమలో రాజధాని పెట్టాలి" అని డిమాండ్ చేశారు. బాబు అరెస్ట్ బీజేపీకి తెలియకుండా జరగదని సాకె శైలజానాథ్ వ్యాఖ్యలు చేశారు.

# అంగన్వాడీల అరెస్టులను ఖండించిన రామకృష్ణ




విజయవాడ: అంగన్వాడీల అరెస్టులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఖండించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియుల అనుబంధ సంఘాల అంగన్వాడీలు శాంతియుత ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేయడంపై రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను అరెస్టులు చేయడం దుర్మార్గమని, ఏపీలో ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులకు పాతరేస్తోందని, రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని విమర్శించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజా ఉద్యమాలను అణచివేసే కుట్రతో పాలన సాగిస్తున్నారని, ప్రజాతంత్ర వాదులంతా ఈ దుష్ట విధానాలను ఖండించాలని కోరుతున్నామని రామకృష్ణ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం ఛలో విజయవాడకు అంగన్‌వాడీ మహిళలు పిలుపునిచ్చారు. ఇందుకు అనుమతి లేదంటూ పోలీసులు ఎక్కడికక్కడ అంగన్‌వాడీలు అరెస్టులు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అంగన్‌వాడీలు రైళ్ల ద్వారా విజయవాడ చేరుకున్నారు. బయటకు రాగానే అడ్డుకుని అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకున్న వారందరినీ ఒక కళ్యాణ మండపంలో ఉంచారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నారు. వేతనాలు పెంచుతామని, రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, నాలుగేళ్లుగా హామీలు అమలు చేయకపోగా, బిల్లులు కూడా ఇవ్వడం లేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# క్వాష్ పిటిషన్‌ను సుప్రీంలో మెన్షన్ చేసిన సిద్ధార్థ లూథ్రా



దిల్లీ: తెదేపా అధినేత చంద్రబాబు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా మెన్షన్ చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యవహారమని.. అక్కడ ప్రతిపక్షాలను అణచివేస్తున్నారని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వద్ద లూథ్రా ప్రస్తావించారు. ఎన్ని రోజుల నుంచి కస్టడీలో ఉన్నారని సీజేఐ అడగగా.. ఈనెల 8న అరెస్ట్ చేశారని న్యాయవాది తెలిపారు.

దీంతో రేపు మెన్షన్ లిస్ట్ ద్వారా రావాలని సిద్ధార్థ లూథ్రాకు సీజేఐ సూచించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబు సుప్రీంను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

# చీరలో విష్ణు ప్రియ.. స్టన్నింగ్ గ్లామర్ షో


బుల్లితెరను ఏలుతున్న తెలుగు యాంకర్లలో విష్ణు ప్రియ కూడా ఒకరు. అనసూయ, రష్మి, శ్రీముఖి తర్వాత ఆ రేంజ్ లో పరువాలు చూపిస్తూ యాంకరింగ్ చేయాలంటే విష్ణు ప్రియ పేరు వినపడుతుంది. ఆమె ఇప్పటి వరకు చాలా షోలకు యాంకరింగ్ చేశారు. ముఖ్యంగా సుడిగాలి సుధీర్ తో కలిసి చేసిన పోవే పోరా తో ఆమెకు ఎక్కువ క్రేజ్ వచ్చిందని చెప్పాలి. ఆ పాపులారిటీతో పలు టీవీ ఛానెళ్లలో ఆమె చాలా షోస్ చేశారు. ఈ మధ్యకాలంలోనే కాస్త టీవీ షో ల విషయంలో స్పీడు తగ్గిందని చెప్పొచ్చు. అయితే, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు



గ్యాప్ లేకుండా తన ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఏ డ్రెస్ లో ఫోటోలు షేర్ చేసినా కూడా, ఆమె అందాలు ఎర వేయకుండా మాత్రం ఉండదు. తాజాగా, ఆమె చీరలో కొన్ని ఫోటోలు షేర్ చేసింది. నీలి రంగు చంకీల చీరలో పిచ్చెంకించేలా ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఆమె బరువైన ఎద అందాలను చూపించీ, చూపించకుండా చూపిస్తూ ఊరిస్తోంది. ఓ వైపు ఎద అందాలు, మరో వైపు నడుము అందాలు చూపిస్తూ అల్లాడించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఇక, ఈ మధ్యకాలంలో స్పెషల్ గా టీవీ షోలు ఏమీ చేయకపోయినా, వేరే షోలలో సందడి చేస్తోంది. రీసెంట్ గా వెబ్ సిరీస్ లలో కూడా అవకాశాలు అందించుకుంటోంది. రీసెంట్ గా 'దయా' వెబ్ సిరీస్ లో షబానా అనే ప్రధాన పాత్ర పోషించింది. జేడీ చక్రవర్తి తో కలిసి నటించి మెప్పించింది. ప్రస్తుతం ఆ సిరీస్ ఓటీటీ వేదిక హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం విష్ణు ప్రియా సిసినిమాల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇప్పటి వరకు అయితే, మంచి మూవీ ఆఫర్స్ ఏమీ రాలేదు. కానీ, ఆ ఛాన్స్ ల కోసం మాత్రం ఆమె చాలా గట్టిగానే ప్రయత్నిస్తోంది. మరి ఆమె ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో చూడాలి.

## రష్మిక.. సీరియస్ లుక్ లో హై గ్లామర్ డోస్

టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తిరుగులేని ఇమేజ్ తో దూసుకుపోతున్న అందాల భామ రష్మిక మందన. ఈ అమ్మడు ఓ వైపు బాలీవుడ్ లో యానిమల్, తెలుగులో పుష్ప 2లో నటిస్తోంది. ఈ రెండు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ కావడం విశేషం. రీసెంట్ గా రెయిన్ బో అనే ఫీమేల్ సెంట్రిక్ మూవీ షూటింగ్ కూడా పూర్తి చేసే పనిలో ఉంది. మాస్ మహారాజ్ రవితేజకి జోడీగా కొత్త ప్రాజెక్ట్ లో రష్మికని తీసుకోవడానికి చర్చలు జరుగుతున్నాయంట. ఇలా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న కూడా ఈ కన్నడ కస్తూరి ఫ్యాషన్ ప్రపంచంలో తన హవాని కొనసాగిస్తూ ఉంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు తనకి సంబంధించి అప్డేట్స్ నిఅందిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు మ్యాగజైన్ కవర్ పేజీలపై కూడా దర్శనం ఇస్తూ ఉంటుంది. బాలీవుడ్ లోకి వెళ్లిన తర్వాత గ్లామర్ డోస్ కూడా పెంచిన రష్మిక మందన తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకునే ప్రయత్నం చేస్తోంది. బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ కావాలని కలలు కంటున్న ఈ అమ్మడు అందుకు తగ్గ స్టేజ్ ని సిద్ధం చేసుకుంటుంది.



తాజాగా ఇంగ్లీష్ ఫ్యాషన్ మ్యాగజైన్ ఎలే కోసం ప్రత్యేకమైన కాస్ట్యూమ్స్ తో బ్లాక్ అండ్ వైట్ ఫోటోలని ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలని ఎలే మ్యాగజైన్ తన ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. వైట్ కలర్ లాంగ్ ప్యాంట్, బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ తీ షార్ట్ వేసుకొని హాట్ హాట్ గా ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలలో రష్మిక మందన హాట్ లుక్స్ కుర్రకారుకి చెమటలు పట్టిస్తున్నాయి. బాడీ ఎక్స్ పోజ్ చేయకుండా హస్కీ లుక్స్ తో హీట్ పెంచేస్తోంది. ఇందులో ఎలే మ్యాగజైన్ రష్మిక మందనని పాన్ ఇండియా స్టార్ గా అభివర్ణిస్తూ ఫోటోలకి ఇంటరెస్టింగ్ క్యాప్షన్ జోడించారు. ఈ క్యాప్షన్ కూడా ఆమె అందాలని ఇందుమడించేలా ఉండటం విశేషం. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో బాలీవుడ్ వీకెండ్ పార్టీలలో కూడా రష్మిక మందన చాలా యాక్టివ్ గా పార్టిసిపేట్ చేస్తోంది. అక్కడ దర్శక, నిర్మాతల దృష్టిలో పడే ప్రయత్నంలో అమ్మడు ఉంది. యానిమల్ తర్వాత మరో హిందీ సినిమాకి ఇప్పటికే రష్మిక సైన్ చేసినట్లు బిటౌన్ లో వినిపిస్తోంది.





# కుమారి శ్రీమతిగా నిత్యామేనన్.. ట్రైలర్ ఎలా ఉందంటే...




దక్షిణాదిన మోస్ట్ టాలెంటెడ్ హీరోయిన్ల జాబితాలో నిత్యామేనన్ మొదటి వరసలో ఉంటుంది. ఆమె నటనకు వంక పెట్టే పనేలేదు. ఎలాంటి పాత్ర అయినా, చాలా సులభంగా చేసేయగలదు. ఒక సినిమా మొత్తాన్ని తన భుజాలపై మోయగల సత్తా ఆమెలో ఉంది. ఇప్పటి వరకు నిత్యా మేనన్ తన నటనతో చాలా పాత్రలకు ప్రాణం పోశారు. ఆమె కారణంగానే సినిమా హిట్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఏ భాషలో నటించినా, తన సొంత డబ్బింగ్ చెప్పుకుంటుంది. అందుకే, ఆమె తొందరగా ప్రేక్షకులకు చేరువ అవుతుంది. ఇప్పుడు, తాజాగా ఆమె కుమారి శ్రీమతి అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. పెళ్లి కాని వారిని సాధారణంగా కుమారి అని సంభోధిస్తారు. పెళ్లైన వారిని శ్రీమతి అని సంభోధిస్తారు. ఇందులో ఆమె పేరు శ్రీమతి, ఇంకా పెళ్లి కాలేదు కాబట్టి కుమారి శ్రీమతి. తాజాగా ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ విడుదల చేశారు. ఆమె పేరు మీద కామెడీతోనే ట్రైలర్ మొదలైంది. తర్వాత ఆమెకు పెళ్లి చేయడానికి వాళ్ల అమ్మ తిప్పలు, ఎన్ని సంబంధాలు తెచ్చినా అంగీకరించదు. దాని వెనక ఒక కారణం. తాత కట్టించిన ఇంటిని తన సొంతం చేసుకోవాలనే కోరిక. దాని కోసం ఆమె ఏకంగా ఏ అమ్మాయి చేయని సాహసం చేసింది. ఊరిలో బారు పెట్టాలని అనుకుంది. ఆ తర్వాత ఆమె ఎదుర్కొన్న పరిస్థితులు ఏంటి? తన తాత ఇంటిని దక్కించుకుందా లేదో తెలియాలంటే వెబ్ సిరీస్ చూడాల్సిందే. ట్రైలర్ చూస్తుంటే, సిరీస్ ఆకట్టుకుంటుందనే విషయం అర్థమౌతోంది. ఈ సిరీస్ లో కార్తీకదీపం సీరియల్ డాక్టర్ బాబు అదేనండి, నటుడు నిరుపమ్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇక, ఇటీవల మసూదతో హిట్ కొట్టిన హీరో కూడా నటిస్తున్నాడు. అలనాటి హీరోయిన్ గౌతమి తల్లి పాత్రలో నటించారు. ఈ సిరీస్ సెప్టెంబర్ 28వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవ్వనుంది. ఒక స్త్రీ వ్యక్తిత్వాన్ని ఇందులో చూపించనున్నారు. గోమటేశ్ ఉపాధ్యాయ్ దర్శకత్వం వహించారు. ఇదిలా ఉండగా, నిత్యామేనన్ కి వెబ్ సిరీస్ లు కొత్తేమీ కాదు. గతంలో బ్రీత్, ఇన్ టు ద షాడోస్, మోడ్రన్ లవ్ హైదరాబాద్ లాంటి సిరీస్ లతో ఆకట్టుకుంది. హాట్ స్టార్ లో మరో వెబ్ సిరీస్ రావడానికి రెడీ అవుతోంది. మరి, ఈ కొత్త వెబ్ సీరీస్ ఎంత వరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# విజయ్ 'లియో' హిందీ వెర్షన్ కష్టాలు




దళపతి విజయ్ నటించిన 'లియో' ఈ సీజన్ లో అతిపెద్ద విడుదలలలో ఒకటిగా ఉండబోతోంది. ఈ చిత్రం తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో విడుదల కానుంది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో అంతా అనుకూలంగా ఉన్నా, 'లియో' హిందీ వెర్షన్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయనేది తాజా సమాచారం. భాషా ప్రాతిపాదికన వివిధ ప్రాంతాల ప్రేక్షకులలో 'లియో'పై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నందున ఈ చిత్రం హిందీ వెర్షన్ బాగా రాణిస్తుందని భావిస్తున్నారు.

అయితే ఈ చిత్రం డిజిటల్ (ఓటీటీ) రిలీజ్ తేదీతో చిక్కులొచ్చి పడుతున్నాయని చెబుతున్నారు. 'లియో' డిజిటల్ పార్టనర్ హిందీ వెర్షన్‌ను విడుదల చేసిన నెలలోపు తమ ప్లాట్‌ఫారమ్‌లో విడుదల చేయాలని ప్లాన్ చేయడమే దీనికి కారణం. ఇది నేషనల్ మల్టీప్లెక్స్ చెయిన్‌లలో ఆందోళన కలిగించింది. నేషనల్ మల్టీప్లెక్స్ చైన్స్ అసోసియేషన్ ఈ నిర్ణయానికి వ్యతిరేకతను వ్యక్తం చేసింది. హిందీ చిత్రాలకు థియేటర్‌లలో విడుదల, ఓటీటీ విడుదల మధ్య రెండు నెలల (8వారాల) గ్యాప్‌ని నిర్దేశించగా సౌత్ సినిమాలకు ఇలాంటి నియమం వర్తించదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో ప్రతిష్ఠాత్మక లియో హిందీ రిలీజ్ చిక్కుల్లో పడిందని చెబుతున్నారు. అయితే 'లియో' హిందీ వెర్షన్‌ను సజావుగా విడుదల చేయాలనే డిజిటల్ (ఓటీటీ) భాగస్వామి తమ నిర్ణయాన్ని మార్చుకుంటారా లేదా హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో సినిమాకు సమస్య కొనసాగుతుందో వేచి చూడాల్సిన సన్నివేశం ఉంది. లియో అక్టోబర్ 19 న విడుదల కానుంది. ఈ చిత్రం పెద్ద స్క్రీన్‌లలోకి రావడానికి ఒక నెల కంటే తక్కువ సమయం ఉంది. ఇటీవల లియో మేకర్స్ గత కొన్ని రోజులుగా ఆయా భాషలలో ఈ చిత్రం పోస్టర్‌ల సెట్‌ను విడుదల చేసారు. ఈ చిత్రం హిందీ పోస్టర్‌లో సంజయ్ దత్‌పై విజయ్ తీవ్రంగా పోరాడుతున్న ఫోటోగ్రాఫ్ ఆసక్తిని కలిగించింది. లియో మేకర్స్ నుండి తదుపరి ప్రకటన రెండవ సింగిల్ లేదా ఆడియో లాంచ్ అవుతుందని భావిస్తున్నారు. సెప్టెంబర్ 30 న చెన్నైలో గ్రాండ్ ఆడియో ఈవెంట్ జరగనుంది.

# సైలెంట్ గా వచ్చేసిన బెదురులంక

యువ హీరో కార్తికేయ నటించిన తాజా చిత్రం 'బెదురులంక 2012' పాజిటివ్ టాక్ దక్కించుకుంది. గత నెల 25న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కమర్షియల్ గా ఆశించిన స్థాయిలో సక్సెస్ దక్కించుకోలేక పోయింది. థియేట్రికల్ రిలీజ్ లో మెప్పించిన ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ మొదలయ్యింది. ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్ లో సైలెంట్ గా బెదురులంక 2012 సినిమాను స్ట్రీమింగ్ చేస్తున్నారు. థియేట్రికల్ స్క్రీనింగ్ మిస్ అయిన వారు ఇప్పుడు ఓటీటీ లో చూడవచ్చు. ఓటీటీ లో స్ట్రీమింగ్ గురించి ఎలాంటి ప్రకటన లేకుండా వచ్చినప్పటికి వెంటనే పెద్ద ఎత్తున ప్రేక్షకులు ఈ సినిమా



ను చూస్తున్నట్లుగా తెలుస్తోంది. కార్తికేయ కి జోడీగా ఈ సినిమా లో డీజే టిల్లు ఫేం నేహా శెట్టి హీరోయిన్ గా నటించింది. విభిన్నమైన కాన్సెప్ట్ తో ఒక మంచి కామెడీ ఎంటర్ టైనర్ గా ఈ సినిమా రూపొందింది. క్లాక్స్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. లౌక్య ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ లో ఈ సినిమాను రవీంద్ర బెనర్జీ ముప్పనేని నిర్మించాడు. మణిశర్మ సంగీతం అందించిన ఈ సినిమాలోని ఒకటి రెండు పాటలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ చిత్రంలో అజయ్ ఘోష్, శ్రీకాంత్ అయ్యంగర్, ఆటో రామ్ ప్రసాద్, వెన్నెల కిషోర్, ఎల్బీ శ్రీరామ్ లు కీలక పాత్రలో నటించారు. థియేట్రికల్ స్క్రీనింగ్ లో యావరేజ్ గా నిలిచిన ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ లో ఎలాంటి ఫలితాన్ని సొంతం చేసుకుంటుందేమో చూడాలి.

## ఫోటో స్టోరి: బిగి సడలని రెడ్ హాట్ అందాలు

భూమి పెడ్నేకర్ పరిచయం అవసరం లేదు. బాలీవుడ్ లో ట్యాలెంటెడ్ నటి. అంతకుమించి సోషల్ మీడియాల్లో వరుస ఫోటోషూట్లతో అరుదైన ఫ్యాషనిస్టాగా వెలిగిపోతోంది ఈ బ్యూటీ. ఇటీవల కొన్ని ప్రయోగాత్మక చిత్రాల్లో అద్భుత నటనతో ఆకట్టుకున్న ఈ బ్యూటీ నటించిన తాజా చిత్రం థాంక్యూ ఫర్ కమింగ్ విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భూమి హంగామా మామూలుగా లేదు. యువనటి భూమి పెడ్నేకర్ తాజా ఫోటోషూట్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. ఇది ట్రెండీ రెడ్ హాట్ లుక్. రెడ్ హాట్ లెదర్ ఫ్రాకులో భూమి అందచందాలు మతులు చెడగొడుతున్నాయి. ఎంపిక చేసిన డిజైనర్ లుక్ కి తగ్గట్టుగానే లైట్ పింక్ కలర్ లిప్ స్టిక్ ని ధరించిన భూమి అలా ఆత్రంగా తన సెల్ ఫోన్ లో ఏదో పరిశీలిస్తూ సెల్ఫీ దిగింది. ఈ రెడ్ హాట్ లుక్ ఇలా ఇన్ స్టాలోకి వచ్చిందో లేదో అలా అంతర్జాలంలో లక్షలాది క్లిక్ లు లైక్ లతో హీట్ పుట్టించింది. థాంక్యూ ఫర్ కమింగ్:కల్ట్ జానర్ మూవీ 'థాంక్యూ ఫర్ కమింగ్' ప్రమోషన్స్ కోసం భూమి ఫుల్ స్వింగ్ లో ఉందిప్పుడు. భూమి పెడ్నేకర్, కుషా కపిల, షెహనాజ్ గిల్, షిబానీ బేడి, లెజెండరీ అనిల్ కపూర్ లాంటి భారీ తారాగణం ఈ చిత్రంలో నటించడం ఆసక్తిని కలిగిస్తోంది.



నటి కం నిర్మాత రియా కపూర్ భర్త కరణ్ బూలానీ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇటీవలే ఈ సినిమా నుంచి పార్టీ గీతం హాంజీ విడుదల కాగా దానికి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా టీమ్ కొత్త ట్రాక్ 'దేశీ వైన్..'ని విడుదల చేసింది. ఇది పెళ్లిళ్ల సీజన్ పై సాగే పాట. తాజా ట్రాక్ పేరు దేశీ వైన్. భూమి పెడ్నేకర్, షెహనాజ్ గిల్, డాలీ సింగ్, కుషా కపిల, షిబానీ బేడీ, కరణ్ కుంద్రా ఈ పాటలో నర్తించారు. ఇది ఆకర్షణీయమైన బీట్‌లతో పెళ్లి పాటల్లో ట్రెండ్ సెట్టర్ గా మారింది. హాట్ అండ్ గ్లామరస్ లేడీస్ డ్యాన్స్ ఫ్లోర్ పై అగ్గి రాజేసారు. భూమి – షెహనాజ్‌ల డ్యాన్సింగ్ స్టైల్ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఖరన్ – సింగ్ రాసిన ఈ పాటకు ఖరాన్ స్వరకర్త. ఈ అద్భుతమైన ట్రాక్‌కి గాత్రాన్ని కరణ్, నికితా గాంధీ, ది రిష్ , అర్జున్ అందించారు. ప్రతిభావంతులైన ఫరా ఖాన్ దీనికి కొరియోగ్రఫీ చేశారు. కథాంశం ఇంట్రెస్టింగ్..భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రలో కరణ్ బూలానీ దర్శకత్వం వహించిన తొలి చిత్రం–థ్యాంక్యూ ఫర్ కమింగ్ కథాంశం ఎంతో ఆసక్తికరం. సెక్స్ లో సంతృప్తి చెందని ఒక యువతి తన భాగస్వాములను ఎలా ఆడుకుంది? అనేదే ఈ సినిమా కథాంశం. ఇది పూర్తి కామెడీ ఎంటర్ టైనర్. రొమాన్స్ కి ప్రాధాన్యత ఉంది. ఆ సినిమాని అనౌన్స్ చేసినప్పటి నుంచి విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని రియా కపూర్ – ఏక్తా కపూర్ సంయు క్తంగా నిర్మించారు. బాలాజీ టెలిఫిల్మ్స్ లిమిటెడ్ – అనిల్ కపూర్ ఫిల్మ్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై విడుదల కానుంది. ఇటీవలే ప్రతిష్టాత్మకమైన 46వ టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రీమియర్ షోను ప్రదర్శించడం గమనార్హం. ఈ గ్రాండ్ ఈవెంట్‌కి టీమ్ హాజరయ్యారు. టిఫ్ లో ప్రీమియర్ వేయగా ఈ చిత్రానికి వీక్షకుల నుండి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. ఈ ఏడాది అక్టోబర్ 6న సినిమాను విడుదల చేయనున్నారు.

# త్వరలోనే మరో 40వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ: కేటీఆర్



హైదరాబాద్: నగరంలోని మూసారాంబాగ్ వద్ద రూ.152 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. దీంతో పాటు మూసీ, ఈసా (ఉప నది)లపై రూ.545 కోట్లతో 14 వంతెనల నిర్మాణానికి శంకు స్థాపన చేయనున్నట్లు చెప్పారు. హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివా స్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2020లో వరదలు వచ్చినప్పుడు ఇక్కడ చాలా ఇబ్బందులు వచ్చాయన్నారు. కరోనా కారణంగా కొన్ని పనులను చేయలేకపోయామని.. ఇప్పుడు అన్నింటినీ పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేయాలనే ఎస్టీపీలను నిర్మిస్తున్నా మన్నారు. దుర్గం చెరువుపై నిర్మించిన బ్రిడ్జి కంటే మరింత అందమైన బ్రిడ్జిలను నిర్మిస్తామన్నారు. గోదావరి జలాలతో గండిపేట చెరువును నింపుతామని చెప్పారు. తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే 30వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేశామని.. త్వరలో నే మరో 40 వేల ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు కేటీఆర్ వెల్లడించారు.

# కాంగ్రెస్‌లో చేరాలని డిసైడ్ అయ్యా.. సోనియా సమక్షంలో చేరుతున్నా: మైనంపల్లి

హైదరాబాద్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 27వ తేదీన ఢిల్లీకి వెళ్లి.. కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ సమక్షంలోనే ఆయన కండువా కప్పుకోనున్నారు. ఇదే విషయాన్ని ఆయన స్వయంగా తెలియశారు. "ఈనెల 27న సోనియా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నా. మల్కాజిగిరి, మెదక్ టికెట్ నాకు, నా కుమారుడికి, అలాగే.. మేడ్చల్ టికెట్ నక్కా ప్రభాకర్‌గౌడ్‌కు ఇవ్వమని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరాను. సర్వేల ఆధారంగా టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గాలికి పెద్ద వాళ్లు కొట్టుకుపోవడం ఖాయం అని మైనంపల్లి వ్యాఖ్యానించారు. మరోవైపు మైనంపల్లిని అఫీషియల్‌గా పార్టీలోకి ఆహ్వానించేందుకు సోమవారం మైనంపల్లి నివాసానికి కాంగ్రెస్ నేతలు క్యూ కట్టారు. అంజన్ కుమార్ యాదవ్, దామోదర రాజనరసింహ తదితరులు దూలపల్లిలోని మైనంపల్లి ఇంటికి చేరుకుంటున్నారు. బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో పాల్గొని చర్చలు జరిపారు. ఇదిలా ఉంటే.. రెండ్రోజుల కిందట బీఆర్ఎస్‌కు మైనంపల్లి రాజీనామా ప్రకటించారు. తనకు మల్కాజ్‌గిరి, తన కొడుక్కి మెదక్ సీట్ల ఒప్పందంతోనే ఆయన కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం మొదటి



నుంచి జరుగుతోంది. మైనంపల్లితోపాటు మరో నలుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్నట్టు సమాచారం. ఇప్పటికే మైనంపల్లితో కాంగ్రెస్ కీలక నేతలు దఫదఫాలుగా చర్చలు జరిపారు. చివరకు తండ్రీకొడుకులకు సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతోనే ఆయన ఆ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు రెడీ అయినట్టు తెలుస్తోంది.

# గణేష్ నిమజ్జనంపై హైకోర్టు కీలక ఆదేశాలు




హైదరాబాద్: నగరంలో గణేష్ నిమజ్జనంపై తెలంగాణ హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాలను హుస్సేన్ సాగర్, చెరువుల్లో నిమజ్జనం చేయవద్దని స్పష్టం చేసింది. పీవోపీ విగ్రహాలన్నింటిని జీహెచ్ఎంసి ఏర్పాటు చేసిన కృత్రిమ తాత్కాలిక నీటి కుంటలలో నిమజ్జనం చెయ్యాలని హైకోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులను యధాతథంగా అమలు చేయాలని నగర సీపీ, జీహెచ్ఎంసీ కమిషనర్‌లకు ఆదేశాలు జారీ చేసింది. గత వాదనల సమయంలోనే(సెప్టెంబర్ 8).. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ)తో తయారు చేసిన గణేశ్ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయరాదని .. ఈ విషయమై గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొంది హైకోర్టు.

**ఎవరెవరి వాదనలు ఎలాగంటే..** ఇదిలా ఉంటే.. పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం ఎత్తేయాలని.. సీపీసీబీ నిబంధనలను కొట్టేయాలని పేర్కొంటూ గణేశ్‌మూర్తి కళాకారుల సంక్షేమ సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ కొనసాగించింది.

పిటిషనర్‌ల తరపు న్యాయవాది.. ధూల్‌పేట్ వాసులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపకుండా ప్రస్తుత ఉపాధిపై దెబ్బకొట్టడం సరికాదని పేర్కొన్నారు. మరో న్యాయవాది వేణుమాధవ్ వాదనలు వినిపిస్తూ గత ఏడాది హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. హుస్సేన్‌సాగర్‌లో పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయలేదని.. తాత్కాలిక కొలనుల్లో నిమజ్జనం చేశామని పేర్కొన్నారు.




# నీకు దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేయ్...

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంఐఎం అధినేత అసుదుద్దీన్ ఓవైసీ సవాల్ విసిరారు. రాహుల్ గాంధీకి దమ్ముంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి కాకుండా హైదరాబాద్ నుంచి పోటీ చేయాలని బహిరంగంగా సవాల్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తూ అసదుద్దీన్ ఓవైసీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో గల బాబ్రీ మసీదు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే కూల్చివేబడిందని ఓవైసీ అన్నారు. "వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి కాకుండా హైదరాబాద్ నుంచి పోటీ చేయాలని మీ నాయకుడికి (రాహుల్‌గాంధీ) నేను సవాల్ విసురుతున్నాను. మీరు పెద్ద పెద్ద స్టేట్‌మెంట్లు ఇస్తూనే ఉన్నారు. కానీ క్షేత్ర స్థాయిలోకి వచ్చి నాతో తలపడండి. కాంగ్రెస్‌కు చెందిన వారు చాలా విషయాలు చెబుతారు. కానీ నేను సిద్ధంగా ఉన్నాను. కాంగ్రెస్ హయాంలో బాబ్రీ మసీదు, సెక్రటేరియట్ మసీదు కూల్చివేశారు" అని అసుదుద్దీన్ ఓవైసీ అన్నారు. కాగా రాహుల్ గాంధీకి ఓవైసీ సవాల్ విసరడం ఇది మొదటి సారి ఏం కాదు. గతేడాది మేలో ఆయన ఇదే విధమైన సవాల్ విసిరారు. రాహుల్ గాంధీకి దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేయాలన్నారు. ఇక రాహుల్ గాంధీ ప్రస్తుతం కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఓవైసీ విసిరిన సవాల్‌పై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఎలా స్పందిస్తునేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. కాగా ఈ ఏడాది చివరలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పార్టీలన్నీ ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను కూడా ప్రారంభించాయి. ఈ క్రమంలో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నెల మొదట్లో తెలంగాణలోని తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి, ఏఐఎంఐఎం ఐక్యంగా పనిచేస్తున్నాయని, ఈ త్రయంపై తమ పార్టీ పోరాడుతోందని అన్నారు. "తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఒక్క బీఆర్ఎస్‌పై పోరాడడం లేదు. బీఆర్ఎస్, బీజేపీ, ఏఐఎంఐఎంలతో కూడిన త్రయంపై పోరాడుతుంది. తమను తాము వేర్వేరు పార్టీలుగా చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పార్టీలన్నీ కలిసి ఐక్యంగా పనిచేస్తున్నాయి. అందుకే తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు లేదా ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీలను ప్రధాని నరేంద్ర మోదీ తన సొంత వ్యక్తులుగా భావిసున్నందన వారిపై సీబీఐ-ఈడీ కేసులు లేవు."అని రాహుల్ గాంధీ అన్నారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను తాజాగా ఓవైసీ ఖండించారు. మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో విజయం కోసం ఉన్న ఏ చిన్న అవకాశాన్ని కూడా పార్టీలు వదిలిపెట్టడం లేదు. అధికార బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఇక కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలను ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే వాటిని నెరవేరుస్తామని చెబుతోంది.

# కవితపై రేవంత్ ప్రచారం.. కేవలం బురదజల్లే ప్రయత్నమే

సిద్దిపేట: రాష్ట్రంలో కొన్ని పార్టీల అధ్యక్షులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పొద్దున లేస్తే బీజేపీపైన బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. త్వరలో కవిత అరెస్ట్ అవుతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ప్రచారం చేయడం కేవలం బురదజల్లే ప్రయత్నమే అని అన్నారు. కవితకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినట్లు ఎవరైనా అప్రోలర్ మీకు చెప్పారా అంటూ రేవంత్‌కు ఎమ్మెల్యే సూటి ప్రశ్న వేశారు. ఎన్నికల ముందు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటని కాంగ్రెస్ వాళ్లు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఓటుకు నోటు సంబంధించి దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిపై ప్రభుత్వం ఎందుకు లైట్ తీసుకుంది.. మీరు ఇద్దరు ఒక్కటేనా? అని నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రాకుండా అడ్డుకునేందుకే రెండు పార్టీల నాయకులు బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మనసు గాయం అయ్యే విధంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకం ఆడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసు ఎందుకు ముందుకు పోతలేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. 20 - 23 కేసు కోసం మాట్లాడే కాంగ్రెస్ పెద్దలు అంతకంటే ముందు జరిగిన 20 - 16 కేసులో ఎందుకు తెరమీదకు వస్తలేదని నిలదీశారు. తప్పు చేసిన ఏ పార్టీ వారైనా అరెస్ట్ చేయాలని.. తమకేమీ అభ్యంతరం లేదని ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు.



# కేసీఆర్ తాంత్రిక పూజలు చేస్తున్నారు... ఎమ్మెల్యేలూ జాగ్రత్త..

కరీంనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ బండి సంజయ్ విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తాంత్రిక పూజలు చేస్తున్నారని.. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పూజలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలకు కేసీఆర్ నిమ్మకాయలు ఇస్తున్నారని.. ఎమ్మెల్యేలూ జాగ్రత్తగా ఉండండి అంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఇతరుల నాశనం కోరుకుంటున్నారన్నారు. డబ్బులతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులు ఉన్నారన్నారు. కాంగ్రెస్‌లో కులాల కొట్లాటను కేసీఆరే పెట్టిస్తున్నారని ఆరోపించారు. అక్కడ ఎవరు గెలిచినా కేసీఆర్ దగ్గరికే వెళ్తారని అన్నారు. కేసీఆర్‌ను యువత క్షమించదని ఎంపీ బండి సంజయ్ విమర్శలు గుప్పించారు.

**గ్రూప్ -1 పరీక్ష నిర్వహించే సత్తాలేని సర్కారు ఇది:** గ్రూప్ -1 పరీక్షను సరిగ్గా నిర్వహించే సత్తాలేని సర్కారు భారాస అని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ నిర్వాకంతో 30 లక్షల మంది నిరుద్యోగుల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. యువత భవిష్యత్ నాశనమవుతుంటే సీఎం కేసీఆర్ నోరెత్తటం లేదన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల్లో సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. "రూ.లక్షలు ఖర్చు చేసిన పరీక్షకు సిద్ధమైన వారికీ ఉద్యోగాలపై ఆశ లేకుండా పోయింది. టెన్త్, ఇంటర్, గ్రూప్ -1 సహా అన్ని పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైంది. నిరుద్యోగ భృతి బకాయిలతో సహా చెల్లించాకే వచ్చే ఎన్నికల్లో భారాస ఓట్లు అడగాలి" అని డిమాండ్ చేశారు.

# త్వరలో నియోజకవర్గానికో డయాలసిస్ కేంద్రం: హరీశ రావు



హైదరాబాద్: తెలంగాణలో వైద్య కళాశాలల సంఖ్య 56కి చేరిందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. 2014కు ముందు రాష్ట్రంలో మూడు డయాలసిస్ కేంద్రాలు మాత్రమే ఉంటే.. ఇప్పుడవి 82కి చేరాయన్నారు. త్వరలో ప్రతి నియోజకవర్గానికి ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రవీంద్ర భారతిలో వైద్య, ఆరోగ్య శాఖ పదేళ్ల ప్రగతి నివేదికను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రగతిని వివరించారు. " గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐసీయూలు 5 మాత్రమే ఉంటే.. ప్రస్తుతం అవి 80కి చేరాయి. రాష్ట్రంలో మతాశిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. 108 అంబులెన్స్‌లను 450కి పెంచాం. ఇవాళ రాష్ట్రంలో 300 అమ్మఒడి వాహనాలు ఉన్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 30 శాతమే. ఇవాళ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 76 శాతానికి పెరిగాయి. అవయవ మార్పిడి శస్త్ర చికిత్సల్లో తెలంగాణ ముందుంది. నిమ్స్‌లో 6 నెలల్లో 100 అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. రూ.30 లక్షలు ఖర్చయ్యే చికిత్సలు ఉచితంగా వేశారు. నిమ్స్‌ను 4 వేల పడకలకు పెంచుకున్నాం. పీజీ వైద్య సీట్లలో దేశంలో రెండో స్థానానికి చేరాం. వైద్యంలో నీతి ఆయోగ్ ర్యాంకుల్లో మూడో స్థానానికి చేరాం. మందులు లేవు, ప్రైవేటులో కొనుక్కోండి అని చెప్పే పరిస్థితి నేడు లేదు. పేదలపై సీఎం కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు ఇదే నిదర్శనం" అని మంత్రి వెల్లడించారు.




# గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుపై హైకోర్టు డివిజన్ బెంచ్‌కు టీఎస్‌పీఎస్సీ..

## నేడు విచారించనున్న న్యాయస్థానం

హైదరాబాద్: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను రద్దుపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను టీఎస్‌పీఎస్సీ ఆశ్రయించింది. ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తూ ఈ నెల 23న సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లింది. అత్యవసర విచారణకు లంచ్ మోషన్ అనుమతి కోరుతు పిటిషన్ దాఖలు చేసింది. అయితే దీనిపై మంగళవారం విచారిస్తామని హైకోర్టు డివిజన్ బెంచ్ తెలిపింది. దీంతో గ్రూప్ రద్దుపై హైకోర్టు మంగళవారం విచారించనుంది. కాగా, ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన తీరు, పరీక్ష నిర్వహణకు చేపట్టిన జాగ్రత్తలు తదితర అంశాలతో టీఎస్‌పీఎస్సీ అప్పీల్‌కు వెళ్లింది. అందులో ప్రధానంగా 3 అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. నిరుడు అక్టోబర్ 16న తొలిసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసిన టీఎస్‌పీఎస్సీ.. ఈ ఏడాది జూన్ 11న నిర్వహించిన పరీక్షలో బయోమెట్రిక్‌ను ఎందుకు అమలు చేయలేదన్న విషయంపై డివిజన్ బెంచ్‌కు స్పష్టత ఇవ్వనున్నది. ప్రిలిమ్స్‌కు హాజరైన 2,33,506 మంది అభ్యర్థుల్లో కేవలం ముగ్గురి కోసం పరీక్షను మళ్లీ వాయిదా వేస్తే మిగిలిన 2,33,503 మంది ఇబ్బంది పడతారని, వారిపై ఆర్థిక భారం పడటంతోపాటు ఎంతో విలువైన సమయం వృథా అవుతుందనే విషయాన్ని ప్రధానంగా ప్రసావించబోతున్నది. గ్రూప్-1 ఉద్యోగానికి ప్రిలిమినరీ పరీక్షే ప్రధానం కాదని, మెయిన్స్ పరీక్ష కూడా ఉన్నదనే విషయాన్ని బలంగా వినిపించాలని కమిషన్ భావిస్తున్నట్టు తెలిసింది.

**యూపీఎస్సీలోనూ బయోమెట్రిక్ లేదు :** ఉద్యోగ నియామక పరీక్షకు తొలిసారి టీఎస్‌పీఎస్సీయే ప్రయోగాత్మకంగా బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. సివిల్ సర్వీస్ నియామకాల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే పరీక్షల్లోనూ ఈ విధానం లేదు. నిరుడు అక్టోబర్ 16న గ్రూప్-1 ప్రిలిమ్స్ సమయంలో బయోమెట్రిక్ హాజరు తీసుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. అభ్యర్థుల్లో చాలా మంది ఒకేసారి పరీక్షా కేంద్రాలకు రావడం, సమయం సరిపోకపోవడం తదితర అంశాలు ఇందుకు కారణం. వీటిని పరిగణనలోకి తీసుకున్న టీఎస్‌పీఎస్సీ రెండోసారి ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించినప్పుడు అభ్యర్థుల సౌలభ్యం కోసమే బయోమెట్రిక్ విధానాన్ని తొలగించింది. ఈ విషయాన్ని అభ్యర్థులందరికీ ముందుగానే తెలియజేయడంతోపాటు ప్రతి పరీక్షా కేంద్రంలో పకడ్బందీగా మూడంచెల తనిఖీలు చేపట్టింది. పరీక్ష జరిగిన రోజు ప్రాథమిక సమాచారం మేరకే అభ్యర్థుల సంఖ్యను తెలిపిన టీఎస్‌పీఎస్సీ.. ఓఎంఆర్ పత్రాల స్కానింగ్ తర్వాత మొత్తం అభ్యర్థుల సంఖ్యను ప్రకటించింది. ఈ అంశాలను కూలంకషంగా హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వివరించాలని కమిషన్ భావిస్తున్నది.

# తెలంగాణ పోలీసింగ్ ఓ సక్సెస్ స్టోరీ: డీజీపీ

హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాలను అనుసంధానం చేసిన కార్యాలయాన్ని తెలంగాణ హోం మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ అంజనీ కుమార్ సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత పోలీస్ శాఖ సక్సెస్ స్టోరీగా నిలిచిందన్నారు. నక్సల్స్, రౌడీల సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాక పోలీసులకు సముచిత న్యాయం జరిగిందని, తెలంగాణ పోలీసింగ్ విధానం న్యూయార్క్ పోలీసింగ్ తరహాలో ఉందని అన్నారు.

సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా 2,500 కెమెరాలను ప్రారంభించినట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ప్రాంతాల్లోనూ నిఘా ఉంచామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఓ స్థాయికి చేరిందని మూడు రకాల సీసీ టీవీ ప్రాజెక్టులను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని అన్నారు. సిటీ వైల్డ్ ప్రాజెక్ట్ కింద 10వేలు, కమ్యూనిటీ కింద 10 వేలు, సేఫ్ సిటీ కింద 2,500 కెమెరాలు ఉన్నాయన్నారు. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకమని సీవీ ఆనంద్ చెప్పారు. వీటి ఆధారంగానే కేసులను త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మల్టీ ఏజెన్సీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com